# కాళీపట్నం రామారావు

## రచనలు




మనసు ఫౌండేషన్

# కాళీపట్నం రామారావు రచనలు

**(2008 వరకూ లభ్య రచనల సంగ్రహం)**

**సంపాదకులు**

వివిన మూర్తి

రచన 'శాయి'


**మనసు ఫౌండేషన్**

2584, Second Stage
Kumara Swamy Layout, BANGALORE 560 078
Ph : 09845575455

**కాళీపట్నం రామారావు రచనలు**

**(2008 వరకూ లభ్యరచనల సంగ్రహం)**

**కాళీపట్నం రామారావు**

కథానిలయం, విశాఖ 'ఎ' కాలనీ

సూర్యానగర్ ఎక్స్‌టెన్షన్

శ్రీకాకుళం 532 001

ముఖచిత్రం మరియు కవర్ డిజైన్

**చంద్ర**

కంపోజింగ్ మరియు పేజి మేకప్

**శివసాయి గ్రాఫిక్స్**

**హైదరాబాద్**

ముద్రణ

**కళాజ్యోతి ప్రాసెస్ లిమిటెడ్**

**హైదరాబాద్**

ప్రతులు

**విశాలాంధ్ర బుక్ హౌస్, అన్ని బ్రాంచీలు**

**నవోదయ బుక్ హౌస్, కాచీగూడ**

# మా మనవి

**1999**లో కాళీపట్నం రామారావు రచనల పేరుతో ఆయన రాసిన రచనలన్నింటినీ ముద్రించి పాఠకులకు అందించాం. రెండేళ్ళలోనే వాటి కాపీలు అయిపోయాయి. అప్పటినుంచి అనేకమంది ఈ పుస్తకంకోసం అడుగుతున్నారు.

ఈలోగా ఆ పుస్తక ప్రచురణ స్ఫూర్తితో మనసు ఫౌండేషన్ ఏర్పడింది. రాచకొండ విశ్వనాథ శాస్త్రి సమగ్ర రచనలన్నింటినీ సంపాదించి లభ్యమయినవన్నీ కలిపి ఒకే గ్రంథంగా 2007లో అందించాం. అవి కూడా ప్రచురించిన నెలలోనే పాఠకులు స్వీకరించారు.

మనసు ఫౌండేషన్ మరికొన్ని పుస్తకాల ప్రచురణకు ప్రయత్నాలు చేస్తోంది.

1. స్వతంత్రానికి పూర్వం 19వ శతాబ్దంలో ఆంధ్రప్రదేశ్ సామాజిక జీవితానికి సంబంధించిన సమాచారం అందించే పుస్తకాలను సేకరించి వాటిని అనువదించి పాఠకులకు అందించాలన్నది ఒక ప్రయత్నం.

2. కొందరు గొప్ప రచయితల సమగ్ర రచనలన్నింటినీ సేకరించి సాధ్యమైనంత వరకూ ఒకే పుస్తకంగా జనానికి అందుబాటులోకి తేవాలన్నది మరొక ప్రయత్నం.

❀ ❀ ❀

శ్రీ కాళీపట్నం రామారావు రచనలను తిరిగి ప్రచురించటానికి కొంత ఖర్చు భరిస్తామన్న మిత్రులు డా॥ పద్మశ్రీ నరేంద్రనాథ్ గారికి, ముద్రణ బాధ్యతలు స్వీకరించిన కళాజ్యోతి ప్రింటర్స్ ఆలపాటి బాపన్న గారికి మా మనఃపూర్వక కృతజ్ఞతలు.

అలాగే-

ఈ పుస్తకం డి.టి.పికి సహకరించిన శివసాయి గ్రాఫిక్స్ రఘు గారికీ, దీని ప్రూఫ్‌లు దిద్దిన ఎన్.రమణమూర్తి, కణుగుల వెంకటరావు గారికీ, 1999 అనంతరం రచనలను, అంతకు ముందు అలభ్యమైన రచనలను అందించిన కథానిలయానికీ ప్రత్యేకించి దాసరి రామచంద్రరావు గారికీ, రచన శాయి గారికీ, ముఖచిత్ర బాధ్యతలు, కవర్ డిజైన్ బాధ్యతలు స్వీకరించిన చంద్రగారికీ మా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ప్రకాశకులు

మనసు ఫౌండేషన్

# విషయసూచిక

**కాళీపట్నం రామారావు కథాసంపుటాల ముందుమాటలు**


1. ఉపోద్ఘాతం - కొడవటిగంటి కుటుంబరావు - యజ్ఞం సంపుటం - 20.1.1971
2. కాళీపట్నం రామారావు గారు - రాచకొండ విశ్వనాథశాస్త్రి - యజ్ఞం సంపుటం - 7.1.1971
3. రెండోసారి చదవడానికి ముందు - వెల్చేరు నారాయణ రావు - కారా కథలు - 1.10.1986

| | | | | |
|---|---|---|---|---|
| 1. | ప్లాట్‌ఫారమో | చిత్రగుప్త | 01-09-1943 | |
| 2. | అయితేగియితే | ఆనందవాణి | 10-09-1944 | |
| 3. | భాయిజాన్ | ఆనందవాణి | 15-10-1944 | |
| 4. | వెళ్లిపోయింది | ఆనందవాణి | 28-01-1945 | |
| 5. | వెనుకచూపు | ఆనందవాణి | 18-02-1945 | |
| 6. | నిజమే అయితే!! | ఆనందవాణి | 25-02-1945 | |
| 7. | ఏమిటిదంతా? | ఆనందవాణి | 11-03-1945 | |
| 8. | మూలం | ఆనందవాణి | 25-03-1945 | |
| 9. | ఇంతా చేస్తే | ఆనందవాణి | 08-04-1945 | |
| 10. | అదృశ్యము | రూపవాణి దీపావళి | 01-10-1945 | |
| 11. | బలహీనులు | వినోదిని | 01-11-1945 | |
| 12. | ఆహ్వానం | రూపవాణి | 01-03-1946 | |
| 13. | రేవతి నుంచి | విరణి | 01-03-1946 | |
| 14. | అవివాహితగానే | ఆనందవాణి | 01-03-1946 | |
| 15. | బలానికి లక్ష్యం | కథాంజలి దీపావళి | 01-10-1946 | |
| 16. | దూరదృష్టి | చిత్రాంగి | 01-10-1946 | |
| 17. | వేకువజాము కలలు | చిత్రాంగి స్పెషల్ | 01-12-1946 | |
| 18. | తెలిసిందా నేనెవరో | ఆనందవాణి | 01-05-1947 | |
| 19. | నవచైతన్యం | చిత్రాంగి | 01-05-1947 | |
| 20. | కొత్త వేమన పద్యాలు | ఆనందవాణి | 01-01-1948 | |
| 21. | జాతిని... | ఆనందవాణి | 01-02-1948 | |
| 22. | తల్లులప్రేమ | చిత్రాంగి | 01-04-1948 | |
| 23. | జననిష్ఠురులు | ప్రజాబంధు | 14-04-1948 | |
| 24. | అసలు రహస్యం | తెలుగు స్వతంత్ర | 21-01-1949 | |
| 25. | నిరవాకాలు | ఆంధ్రపత్రిక | 30-03-1949 | |

| | | | | |
|---|---|---|---|---|
| 26. | కీర్తికాముడు | ఆంధ్రపత్రిక | 1949 | |
| 27. | పెంపకపు మమకారం | భారతి | 9 మరియు 10, 1949 | |
| 28. | జయప్రదజీవనం | ఆంధ్రపత్రిక | 21-12-1949 | |
| 29. | రాగమయి | భారతి | 01-11-1950 | |
| 30. | అప్రజ్ఞాతం | జయభారత్ | 01-11-1951 | |
| 31. | అభిమానాలు | ఆంధ్రపత్రిక ఉగాది | 01-03-1952 | |
| 32. | పలాయతుడు | ఆంధ్రపత్రిక ఉగాది | 01-03-1953 | |
| 33. | సెనాపతి వీరన్న | భారతి | 01-04-1953 | |
| 34. | అభిశప్తులు | ఆంధ్రపత్రిక ఉగాది | 01-03-1954 | |
| 35. | అశిక్ష అవిద్య | భారతి | 01-04-1955 | |
| | **1956-67** | | | |
| 36. | నేనెందుకు రాసేను | సుధ | 01-11-1967 | |
| 37. | తీర్పు | యువ | 01-03-1964 | |
| 38. | ఇల్లు | జ్యోతి | 01-04-1964 | |
| 39. | వధ | విశాఖ ద్వైమాసిక | 01-01-1965 | |
| 40. | యజ్ఞం | యువ దీపావళి | 01-01-1966 | |
| 41. | మహదాశీర్వచనం | ఆంధ్రజ్యోతి | 27-04-1967 | |
| | **1968-72** | | | |
| 42. | వీరుడు మహావీరడు | ఆంధ్రజ్యోతి | 05-04-1968 | |
| 43. | ఆదివారం | ఆంధ్రజ్యోతి | 07-06-1968 | |
| 44. | హింస | ఆంధ్రజ్యోతి | 07-11-1968 | |
| 45. | నోరూమ్ | ఆంధ్రజ్యోతి | 13-12-1968 | |
| 46. | స్నేహం | యువ | 01-04-1969 | |
| 47. | ఆర్తి | ఆంధ్రజ్యోతి | మే, జూన్, 1969 | |
| 48. | భయం | యువదీపావళి | 01-11-1970 | |
| 49. | శాంతి | జయశ్రీ సంక్రాంతి | 14-01-1971 | |
| 50. | చావు | సృజన | 01-03-1971 | |
| 51. | జీవధార | స్వాతి | 01-06-1971 | |
| 52. | న్యాయం | ముందుమాట | 08-05-1972 | |
| 53. | సంజాయిషీ | కారాకథలముందుమాట | 28-07-1992 | |
| 54. | కుట్ర | నిజం-విరసం ప్రత్యేకం | 15-08-1972 | |
| | **1973-92** | | | |
| 55. | అవార్డు తిరస్కృతి | | 25-10-1974 | |

| | | | | |
|---|---|---|---|---|
| 56. | ఇంటర్వ్యూ - ఈశ్వర్ | జ్యోతి | 01-08-1976 | |
| 57. | భూమి భాగోతం | ముందుమాట | 01-04-1978 | |
| 58. | శ్రీశ్రీ మార్గం శ్రీశ్రీ కంటే గొప్పది | ఆంధ్రజ్యోతి | 30-11-1979 | |
| 59. | నాకు నచ్చిన కథ | స్వాతి | 01-12-1979 | |
| 60. | రక్కసి బలుపు ఆగడం | ఆంధ్రజ్యోతి దీపావళి | 01-10-1981 | |
| 61. | మేరీ టైలర్ | ముందుమాట | 27-12-1981 | |
| 62. | ఇష్టాగోష్టి సొతంత్రం చిగురేసింది | | 15-08-1985 | |
| 63. | నేనూ నా రచన కారా కథల | ముందుమాట | 01-08-1986 | |
| 64. | కృతజ్ఞతలు-కారా కథల | ముందుమాట | 01-08-1986 | |
| 65. | ఇంటర్వ్యూ-జగన్ | ఆంధ్రప్రభ దినం | 10-12-1986 | |
| 66. | కొండగాలి | ముందు మాట | 12-02-1987 | |
| 67. | కథలు రాయటం గురించి-1 | జముకు-1 | 01-05-1987 | |
| 68. | కథలెందుకు రాస్తారు | ఆంధ్రభూమి దినం | 20-06-1987 | |
| 69. | కథ గురించి | జ్యోతి | 01-07-1987 | |
| 70. | కథలెలా రాస్తారు | ఆంధ్రభూమి దినం | 18-07-1987 | |
| 71. | కథలు రాయటం గురించి-2 కథంటే | జముకు-2 | 01-08-1987 | |
| 72. | కథలు రాయటం గురించి-2 కథాంగాలు1 | జముకు-3 | 01-11-1987 | |
| 73. | కథాకథనం ముందుమాట | కథాకథనం | 01-01-1990 | |
| 74. | కథాకథనం ముందుమాట క్షమాపణ | కథాకథనం | 01-01-1990 | |
| 75. | కథాకథనం ముందుమాట ఈ వ్యాసాలెందుకు | కథాకథనం | 01-01-1990 | |
| 76. | కథరాయాలంటే | కథాకథనం | 01-01-1990 | |
| 77. | కథ | కథాకథనం | 01-01-1990 | |
| 78. | కథకానిది | కథాకథనం | 01-01-1990 | |
| 79. | కథ-వస్తువు | కథాకథనం | 01-01-1990 | |
| 80. | కథ-వస్తువు ఎంపిక | కథాకథనం | 01-01-1990 | |
| 81. | కథారచన | కథాకథనం | 01-01-1990 | |
| 82. | కథాసామగ్రిగా వర్ణనలు | కథాకథనం | 01-01-1990 | |
| 83. | కథ-పాత్రలు | కథాకథనం | 01-01-1990 | |
| 84. | కథ-సంభాషణ | కథాకథనం | 01-01-1990 | |
| 85. | కథ-సంభాషణలు | కథాకథనం | 01-01-1990 | |
| 86. | కథ-సన్నివేశాలు, సంఘటనలు | కథాకథనం | 01-01-1990 | |
| 87. | కథ-భాష | కథాకథనం | 01-01-1990 | |
| 88. | కథ-నామకరణం | కథాకథనం | 01-01-1990 | |
| 89. | ఆరంభం-ముగింపు | కథాకథనం | 01-01-1990 | |
| 90. | ఆప్తవాక్యం | కథాకథనం | 01-01-1990 | |

| | | | | |
|---|---|---|---|---|
| 91. | ఇంటర్వ్యూ-చందు సుబ్బారావు | ఆంధ్రజ్యోతి దినం | 14-03-1988 | |
| 92. | దీర్ఘశృతి-తీవ్రధ్వని | అరవైలో ఇరవై | 30-04-1989 | |
| 93. | interview-P. Srinivas Sastry | Sunday Chronicle | 15-10-1989 | |
| 94. | ఇంటర్వ్యూ-కూచిమంచి ఉదయ్ | ఉదయం | 20-10-1989 | |
| 95. | ఇంటర్వ్యూ-అఫ్సర్ | ఆంధ్రజ్యోతి దినం | 22-09-1980 | |
| 96. | సంపాదకీయం -రచన తొలిసంచిక | రచన | 01-10-1991 | |
| 97. | శ్రీమతి రమణిగారికి | ఆంధ్రజ్యోతి | 12-06-1992 | |
| 98. | సంకల్పం | రచన | 01-10-1992 | |
| 99. | ఇంటర్వ్యూ-జి శ్రీనివాస్ | ఆంధ్రప్రభ దినం | 16-11-1992 | |
| 100. | ఇంటర్వ్యూ - విలేఖరి | ఆంధ్రప్రభ దినం | 22-11-1992 | |
| | **1993-99 నేపథ్యం** | | | |
| | **రచనలు** | | | |
| 101. | సంపాదకీయం - రచన | రచన | 01-04-1993 | |
| 102. | శ్వేతరాత్రులు | ముందుమాట | 02-06-1993 | |
| 103. | రీడర్స్ నోట్- సరిహద్దు | రచన | 01-08-1993 | |
| 104. | ఘనత - ఇల్లు | ముందుమాట | 10-11-1993 | |
| 105. | సంపాదకీయం రచన రావిశాస్త్రి | రచన | 15-11-1993 | |
| 106. | రీడర్స్ నోట్ పేలుపిళ్ళె | రచన | 01-12-1993 | |
| 107. | రీడర్స్ నోట్-చరిత్ర మనిషి మార్క్సిజం | రచన | 01-01-1994 | |
| 108. | రీడర్స్ నోట్ - మృత్యుంజయ | రచన | 01-02-1994 | |
| 109. | సంపాదకీయం రచన చాసో | రచన | 01-03-1994 | |
| 110. | తెలుగు కథకు విశ్వసాహిత్యంలో | కళాసాగర్ 22 వార్షికం | 01-04-1994 | |
| 111. | రీడర్స్ నోట్-స్వర్ణసీమకు స్వాగతం | రచన | 01-05-1994 | |
| 112. | రీడర్స్ నోట్ - రాగో | రచన | 01-06-1994 | |
| 113. | ప్రవాహం | ముందుమాట | 03-07-1994 | |
| 114. | రీడర్స్ నోట్ చివరికి మిగలనిది | రచన | 01-10-1994 | |
| 115. | కవనశర్మ కథలు | ముందుమాట | 30-07-1995 | |
| 116. | సంఘర్షణ | అట్టవెనుకమాట | 01-12-1995 | |
| 117. | ఇంటర్వ్యూ-చంద్ర | ఆంధ్రజ్యోతి దినం | 11-12-1995 | |
| 118. | ఇంటర్వ్యూ-ప్రత్తి నాగేశ్వరరావు | ఆంధ్రప్రభ దినం | 01-01-1996 | |
| 119. | the story behind my story writing deccan heraid | 23-03-1996 | | |
| 120. | ఇంటర్వ్యూ కెవియస్ వర్మ | వార్త | 06-07-1996 | |
| 121. | ఏటిపాట | అట్టవెనుక మాట | 31-10-1997 | |
| 122. | ప్రత్యామ్నాయం | అట్టవెనుక మాట | 23-12-1997 | |

| | | | | |
|---|---|---|---|---|
| 123. | Kathanilayam trush deed | | 17-04-1988 | |
| 124. | వీలునామా | | 15-10-1996 | |
| | **2000 నుండి నేపథ్యం రచనలు** | | | |
| 125. | అర్థంకాని మానవగాథ | రూపవాణి దీపావళి | 01-10-1947 | |
| 126. | గురుస్మరణ | ఆంధ్రజ్యోతి | 06-05-1988 | |
| 127. | నేలతల్లి విముక్తికోసం | ముందుమాట | 23-08-1990 | |
| 128. | రేడియో ఇంటర్వ్యూ కేతు విశ్వనాధరెడ్డి | | 19-03-1995 | |
| 129. | ఇంటర్వ్యూ దాసరి అమరేంద్ర | విపుల | 01-03-1999 | |
| 130. | ఇంటర్వ్యూ -ద్వానాశాస్త్రి | ఆంధ్రజ్యోతి దినం | 27-09-1999 | |
| 131. | ఇంటర్వ్యూ -అంబల్ల జనార్ధన్ | సుప్రభాతం | 19-08-2000 | |
| 132. | హంసగీతం | ముందుమాట | 29-03-2003 | |
| 133. | ఇంటర్వ్యూ - ఈనాడు న్యూఢిల్లీ | ఈనాడు | 01-04-2004 | |
| 134. | ఇంటర్వ్యూ కెవిఎస్ వర్మ | వార్త | 01-09-2004 | |
| 135. | ఇంటర్వ్యూ-ఆర్ఎం.ఉమామహేశ్వరరావు | వార్త | 16-11-2005 | |
| 136. | అన్నెమ్మ నాయురాలు | జంఝూవతి కథలు | 01-01-2006 | |
| 137. | జగన్నాటకం | అట్టవెనుక మాట | 01-04-2006 | |
| 138. | నాగురించి నేను | చినుకు | 01-04-2006 | |
| 139. | గౌరు నాయుడు | అట్టవెనుక మాట | 25-11-2006 | |
| 140. | నాకూ విశ్రాంతి కావాలి | అట్టవెనుక మాట | 01-05-2007 | |
| 141. | నేనూ నా జీవన దృక్పథం | ఈ భూమి | 16-08-2007 | |
| 142. | ఆర్.కె ఉత్తరం కారా స్పందన | ఆంధ్రజ్యోతి దినం | 29-10-2007 | |
| 143. | ఇంటర్వ్యూ-ప్రజాశక్తి, తిరుపతి | ప్రజాశక్తి | 27-11-2007 | |
| 144. | అభిప్రాయం-ప్రపంచీకరణ | ఆంధ్రజ్యోతి దినం | 03-12-2007 | |
| 145. | ఇంటర్వ్యూ ఈనాడు శ్రీకాకుళం | ఈనాడు | 19-01-2008 | |
| 146. | ఉపాధ్యాయుడుగా నేను | ఉపాధ్యాయ వజ్రోత్సవ సంచిక | 1-02-2008 | |
| 147. | ఆత్మావలోకనం | చినుకు | 01-04-2008 | |
| 148. | అభిప్రాయం- ఆనందం | ఆంధ్రజ్యోతి దినం | 13-05-2008 | |
| 149. | అభిప్రాయం వ్యాపకం | ఆంధ్రజ్యోతి దినం | 11-07-2008 | |
| 150. | సంపాదకుల లేఖ | రచన | 01-08-2008 | |

# కొడవటిగంటి కుటుంబరావు గారి
## ఉపోద్ఘాతం



మనుషుల్లో ఉన్నన్ని రకాలు కథల్లోనూ ఉన్నాయి. 'పురుషులందు పుణ్య పురుషులు వేరయా' అన్నట్లు కథల్లో గొప్ప కథలు వేరు. గొప్ప కథకులు అన్నప్పుడల్లా రారు. గొప్ప కథకులు వస్తేగాని గొప్ప కథలు రావు. ఏ చెట్టుకు ఆ కాయే కాయటం తప్పనిసరిగద.

ఎవరు గొప్ప కథకులు? ఏవి గొప్ప కథలు? ఆ మాట చెప్పే వారెవరు? ఈ మూడు ప్రశ్నలను అడ్డం పెట్టుకొని, అన్ని కథలూ ఒకటే. అందరు కథకులూ ఒకటే అని వాదించవచ్చు. కాని, ఎవరూ చూడకుండా జరిగిన పనికి అంతరాత్మ సాక్షి అన్నట్టుగా, ఏది గొప్ప కథ అన్నదానికి కథలు చదవడంలో సమర్థులే సాక్షి. కథలు అందరూ రాయలేనట్టే అందరూ చదవలేరు. ఏ కథనైనా చదవవలసిన విధంగా చదివే వారు బహు తక్కువ. అందులోని సారం ఆఖరి బొట్టు దాకా గ్రహించే వారు ఇంకా తక్కువ.

ఈనాడు వెలువడే అసంఖ్యాకమైన కథలు పిప్పరమెంటు బిళ్ళలల్లే చప్పరించేసి మింగేవి, నమిలేవి కావు. సాధారణంగా ఆహారాన్ని నమిలే అలవాటు లేనివాళ్ళకి త్వరలోనే పళ్ళూడిపోతాయి. ఆ తరువాత దేన్నీ వాళ్ళు కొరకలేరు. నమల్లేరు.

అంచేత ఈనాటి కథకుల్లో పురుషులెవరో, పుణ్య పురుషులెవరో విచక్షణగా తెలుసుకునే వారు బహు కొద్దిమంది ఉంటున్నారు. ఇవాళ గొప్ప కథలు రాసేవాళ్ళను లెక్కించటానికి ఒక చేతి వేళ్ళే ఎక్కువ. వారిలో ఒకడైన కాళీపట్నం రామారావుగారి రచనలు ఇదివరకు పుస్తక రూపంలో రాకపోవటం ఎంత వింత! మంచి కథలు రాసే వాళ్ళు చాలామంది ఉన్నారు. గొప్ప కథకు గొప్ప లక్ష్యం ఉండాలి. మంచి కథలు కాకతాళీయంగా రావచ్చు. గొప్ప కథలు గొప్ప కథకులు రాస్తే తప్ప రావు. గొప్ప కథలు రాసే ఘనత ఒక రాచకొండ విశ్వనాధశాస్త్రికీ, ఒక బీనాదేవికీ, ఒక కాళీపట్నం రామారావుకీ దక్కింది. ఈ జాబితా ఇంతటితో ఆగదు. కుర్రకారు కథకులలో రత్నాల్లాంటి వారు తయారవు తున్నారు. ఇది నిజానికి ఒక ఉద్యమం.

ఈ ఉద్యమం గురజాడతోనే ఆరంభమైనా కొంతకాలం గుంట పూలు పూసిన మాట నిజం. గురజాడ కథలు రాసేదాకా కథ అంటే "నిన్న" జరిగినదిగా వుండేది. కథలూ, ఇతిహాసాలూ, ఉపాఖ్యానాలూ దేనికి చెప్పే వారంటే గతం నుంచి ఏదో గుణపాఠం నేర్చుకునేటందుకు. గురజాడతో ఆరంభమైన ఆధునిక కథ వర్తమానాన్ని విమర్శించటానికి పూనుకున్నది.

వర్తమానాన్ని విమర్శించటానికి పూనుకున్న కథ మధ్యతరగతి లోతులు మథించటం ఆరంభించింది. లోతుకు పోవటం ఎంత కష్టమో ప్రయత్నించిన వాడికి తెలుస్తుంది.

పది అడుగుల లోతుకు వెళ్ళటం కన్నా పదకొండు అడుగుల లోతుకు వెళ్ళటం రెట్టింపు కష్టం. ఆ తరువాత అంగుళం అంగుళానికి కష్టం పెరిగిపోతుంది. (రెస్ట్‌మాస్ గల అణు కణాలు కాంతి వేగాన్ని సమీపించేటప్పుడు వాటి భారం ఏ రేటున పెరిగేదీ శాస్త్రజ్ఞుల నడగండి!)

అందుచేతనే అనేక దశాబ్దాలపాటు కథకులు మధ్యతరగతి జీవితాన్ని మధించినా, దాని అడుగున దాగి ఉన్న సత్యాలను పూర్తిగా పైకి తేలేకపోయినారు. ఈలోగా కాలస్వభావం మారి, మధ్య తరగతి జీవిత సత్యాలు చరిత్ర గతికి  పెడ అయిపోవటంచేత కాబోలు. సినిమా కథలను పోలిన సాహిత్యం బయలుదేరింది. ఈ పిప్పిరమెంటు సాహిత్యం చాటున కొత్తరకం సాహిత్యం, అట్టడుగు ప్రజల జీవితాలకు సంబంధించినది పుట్టుకొచ్చింది.

ఏ తరగతిలో విప్లవం నిక్షిప్తమై ఉన్నదో ఆ తరగతి జీవితాన్ని మధించి కొద్దిమంది కథకులు కథా రచనల కొత్త శకాన్ని సృష్టించారు. వీళ్ళూ మధ్య తరగతి రచయితలే. కాని అధమ తరగతి జీవితాన్ని ఎరిగిన వాళ్ళు, అర్థం చేసుకున్న వాళ్ళు. ఆ తరగతి మీద అభిమానమూ, ఆపేక్షా గలవారు. ఇవన్నీ లేనివాళ్ళు "సారా కథలూ", "హాంగ్ మి క్విక్", "యజ్ఞం" రాయలేరు. పిప్పరమెంటు బిళ్ళల్లాంటి కథలు రాసేవారికి ఇది రాయటం అసాధ్యం.

"యజ్ఞం" మొదటిసారి చదవగానే నాకు చప్పున గురజాడ రాసిన "మీ పేరేమిటి?" జ్ఞాపకం వచ్చింది. ఈ రెండి మధ్యా ఎన్నో పుష్కరాల ఎడం ఉన్నది. కాని, ఇలాటి కథ మరొకటి అడ్డం ఉన్నట్టు నాకు తెలియదు. గురజాడ ఒక గ్రామానికి సంబంధించిన మౌఢ్యాన్ని గురించి రాస్తే, కాళీపట్నం ఒక గ్రామానికి సంబంధించిన రాక్షసాన్ని గురించి రాశాడు.

కథా పరిణామం గురించి నాకున్న పరిజ్ఞానం సరి అయినదయితే "యజ్ఞం", "ఆర్తి"లాంటి కథలు ప్రపంచ యుద్ధానికి పూర్వం వచ్చి ఉండటం సాధ్యం కాదు. ఈ కథలలో విశేషమేమంటే, అట్టడుగు జీవితంలోని అంతస్సంఘర్షణ కూడా, దాని వెనక ఉన్న భౌతిక కారణాలతో సహా స్పష్టంగా కనిపిస్తుంది. "యజ్ఞం" శ్రీకాకుళం పోరాటాలకు ముందు నడిచిన కథ అనాలి.

"ఆర్తి" వాటికి యింకా కొంచెం ముందుదేమో, అందుచేతనే అందులో అంతస్సంఘర్షణ మరింత స్ఫుటంగా ఉన్నది. అంతస్సంఘర్షణలు జరిగిపోయినాక విప్లవం తల ఎత్తాలి. ఈ రెండు కథలకూ ఈనాటి విప్లవోద్యమాలతో రక్త సంబంధం ఉన్నది.

"తీర్పు" వీటిలో కలిసే కథ కాదు. కాని నాలుగు ఒకే రకం అట్టల మధ్య అయిదో అట్ట కాస్త మేలురకంది చేరితే ఎలాంటి ఆర్థిక రాజకీయ సమస్య ఏర్పడేది ఈ కథ చిత్రిస్తున్నది. జీవిత సత్యాలు ఎంత చిన్న వాటిలోనైనా కనిపిస్తాయన్న నా నమ్మకాన్ని ఈ కథ బలపరుస్తున్నది. ★

– కొడవటిగంటి కుటుంబరావు

20-1-71మద్రాసు ("యజ్ఞం" కథాసంపుటి నుంచి)

# రాచకొండ విశ్వనాథశాస్త్రి గారి మాటల్లో...



చెఖోవ్ రాసిన "ఇన్ ది గలీ" అనే కథలో దిక్కూ మొక్కూ లేని ఓ పేద పిల్లని ఓ పోలీసువాడు పెళ్లాడుతాడు. వాళ్ళకి ఓ కొడుకు పుడతాడు. ఈ లోపున ఓ దొంగ నాణేల కేసులో ఆ పోలీసువాడికి శిక్ష పడగా అతను సైబీరియాలో కలిసిపోతాడు. అప్పుడా పేదపిల్ల తన కొడుకుని పెట్టుకుని అత్తమామల పంచని ఊడిగం చేస్తూ ఉంటుండగా పెద్దాని కొడుక్కి ఆస్తి పంచవలసి వస్తుందికదా అనేకోపం పెట్టుకొని ఆమె తోటికోడలు ఆమె లేతకొడుకు మీద ఉడుకు నీళ్ళు కుమ్మరిస్తుంది. ఉడికిపోయిన కొడుకుని భుజాన వేసుకొని కొన్ని మైళ్ళు నడుచుకొని ఆ పేత్తల్లి ఆస్పత్రికి వెళ్ళేసరికి సాయంకాలం అవుతుంది.

అక్కడ డాక్టరు ఆ పిల్లణ్ణి తనిఖీ చేసి ఆమెతో, "అమ్మా నీ కొడుకు చచ్చిపోయేడమ్మా" అని చెప్తాడు. అస్తమించబోయే సూర్యకిరణాల్లో ఆస్పత్రి అద్దాల తలుపులు భగభగ మండుతున్నట్లుం టాయి. ఆ మంటల్లోంచి ఆ పేత్తల్లి ఆ లేత శవాన్ని భుజాన వేసుకొని వచ్చి నాటు రోడ్డు చేరుకొనేసరికి కారు చీకట్లు పులుముకుంటాయి. అప్పుడు, ఆమె ఊరివైపే వెళ్ళే ఓ ముసలి బండివాడు ఆమె సంగతి తెలుసుకొని ఆమెని తన బండి ఎక్కమని చెప్పి, ఆమెకి తన అనుభవాల సారాంశం తెలియజెప్తాడు.

ఆ బండి వాడు చాలా రాజ్యాలు వెళ్ళేట్ట. చాలా జీవితం చూసేట్ట. ఎక్కడ చూసినా చెడ్డే చెలామణి అవుతోందిట. ఎక్కడకెళ్ళినా పాపమే తెగ పెరుగుతోందిట. అయితే, ఇంత ఘోర పాపపంకిలంలో ఇంతమంది జనం ఇంకా ఈ మేరకైనా బతగ్గలిగే ఉన్నారంటే ఈ లోకంలో "మంచి" అనేది ఎక్కడో ఎంతో కొంత ఉండే ఉండాలిట. ఆ మంచితనం ఉంటుందనే నమ్మి, ఉండాలనే ఆశించి మనం బతకాలిట. (ఆ పేత్తల్లి, ఆఖరికి, తన తోటికోడలు కట్టే ఇటికల(?) ఫ్యాక్టరీలో కూలి మనిషిగా చేరి తన కష్టాల్ని పాటలుగా మార్చుకొని కాలం వెళ్ళబుస్తుంది.)

చెఖోవ్ చెప్పిన బండివాడు చెప్పిన బతుకు మాటలు నన్నెందుకోగాని బాగా ఆకర్షిస్తాయి. శ్రీ కాళీపట్నం రామారావుగార్ని చూసినప్పుడల్లా ఆ మాటలే నాకు గుర్తుకొస్తాయి.

పోలీసులూ, ప్లీడర్లూ, కోర్టులూ, కేసులూ, బేంకులూ, వడ్డీలూ, ఫ్యాక్టరీలూ, లాభాలూ, వేలాలూ, అరెస్టులూ, రోగాలూ, దారిద్ర్యాలూ, మేడలూ, వాటిపక్క గుడిసెలూ, అమెరికన్ బాంబులూ, రష్యన్ రాకెట్టులూ, పెద్దవారి కాల్పులూ, పేదవారి చావులూ, దొరలూ, దొంగ కవులూ తెగ పెరిగే ఈ పాడులోకంలో ఎక్కడో అక్కడ ఈ పాటైనా ఏ పాటైనా వర్షాలు కురుస్తున్నాయన్నా, కాల్వలు పారుతున్నాయన్నా, పంటలు పండుతున్నాయన్నా, కొంతమందైనా పేదలు కొన ఊపిరితోనైనా బతగ్గలుగుతున్నారన్నా శ్రీ కాళీపట్నం రామారావుగారి లాంటి సజ్జనులుండబట్టేనని నేను నమ్ముతున్నాను.

భగవంతుడికి జనం నమస్కరిస్తారు. ఆ భగవంతుడు మనిషిగా మారితే అప్పుడు కూడా అందరూ అతనికి నమస్కరిస్తారని, మనందరికీ తెలిసిన విషయమే. అయితే, దేముడు మానవుడైతే అప్పుడు అతనైనా సరే శ్రీ కాళీపట్నం రామారావు గారికి నమస్కరించి తీరవలసిందే! 'పురుషులలో పుణ్యపురుషులు వేరయా' అని వేమన గారు రామారావు గార్లాంటి వారిని చూసే చెప్పి ఉంటారు.

రామారావు గారి వంటి సజ్జనుడి సాంగత్యం లభించడం నా అదృష్టం. ఆయన లాంటి గొప్ప కథకులుండడం మన జనం అదృష్టం. ★

– రాచకొండ విశ్వనాథశాస్త్రి

7-1-1971 ("యజ్ఞం" కథాసంపుటి నుంచి)

విశాఖపట్నం

# కాళీపట్నం రామారావు కథలు రెండోసారి చదవడానికి ముందు...

కాళీపట్నం రామారావుగారు తెలుగులో కథలు రాస్తున్న వాళ్ళలో అగ్రశ్రేణికి చెందిన వారని ఎందరో పాఠకులూ, విమర్శకులూ ఒప్పేసు కున్నారు. ఈవాళ ఆయన్ని నాలాంటి వాడు ప్రత్యేకంగా పొగడవలసిన అవసరం లేదు. ఆయన కథలు ప్రపంచ సాహిత్యంలో గొప్ప స్థానం పొందాయి. తెలుగువాళ్ళు ఈ శతాబ్దిలో సాధించిన సాహిత్య పరమార్థం ఏమిటని అడిగితే మనం గర్వంగా చూపించే ఉత్తమ సాహిత్యంలో ఆయన కథలు వుంటాయి. అయితే ఈ వ్యాసం ప్రయోజనం ఇలాంటి పొగడ్తలు చెప్పేసి వూరుకోవటం కాదు. ఆయన కథలు ఇంత గొప్పవి ఎలా అయ్యాయో మరొక్కసారి సవిమర్శంగా పరిశీలించటం.

రామారావు గారు అట్టే కథలు రాయలేదు. ఆయన రాసినవన్నీ ఈ పుస్తకంలో వున్నాయి. దాదాపు ఆయన రాసిన వరసలోనే ఈ కథలు ప్రచురించటం వల్ల కథా రచయితగా ఆయన పొందిన పరిణామం కూడా బోధపరచుకోవడానికి వీలుగా వుంది ఈ పుస్తకం. ఆయన తొలి కథల్లో చాలా భాగం పై కులాల్లోని మధ్య తరగతి కుటుంబాల గురించి రాసినవి. 1964 నుంచి అనుకుంటాను – ఆయన కథల్లో వస్తువు మారటం మొదలు పెట్టింది. "యజ్ఞం" కథతో ఆయన పల్లెటూళ్ళ, పేద రైతుల నిరుపేద కుటుంబాల జీవితాల గురించి రాయటం మొదలు పెట్టారు. తొలి కథల్లో కానివ్వండి, తర్వాతి కథల్లో కానివ్వండి, ఆయన కథల్లో మన మనస్సులకి ఆహ్లాదం కలిగించే విషయాలు అట్టే కనిపించవు. సాహిత్యం సుఖం కలిగించాలి అనుకునే వాళ్ళకి ఇవి నప్పవు. అలా అని రామారావుగారి కథలు మనని దుఃఖపెట్టవు కూడా. లోకంలో కావలసి నంత దుఃఖం వుంది. దాన్ని సాహిత్యంలో ఏడుపుగా మార్చి పాఠకులకి కన్నీళ్ళు తెప్పించి అలా ఏడవగలిగిన పాఠకులు హాయిగా తృప్తి పొందే కథలూ, కావ్యాలూ మనం ఎరుగుదుం. రామారావుగారి కథలు ఈ పని చెయ్యవు. ఇవి మనం భరించలేని అశాంతిని మనలో కలిగించి మనకి స్తిమితంగా నిద్రపట్టకుండా చేస్తాయి. మనకి ఏది తెలియక పోవడం వల్ల మన జీవితాల్లోనూ, సమాజంలోనూ వున్న పరిస్థితులతో సర్దుకుపోతూ బతుకుతున్నామో అది తెలియజెప్పేస్తాయి: ఇంక ఆ తర్వాత మనం నిబ్బరంగా వుండలేం. వున్న పరిస్థితులకి మనం కారణమనేనా ఒప్పుకోవాల లేదా అవి మార్చడానికి బాధ్యతేనా వహించాలి.

గొప్ప పుస్తకాలు మనకి హాయి కలిగించవు. మనని మనకి విప్పి చెప్పేసి అల్లరి పెడతాయి; అలజడి పెడతాయి; మనని నిలదీసి ప్రశ్ని స్తాయి? నిలబెట్టి నడిపిస్తాయి. ఏదయినా చివరికి అశాంతే ఫలితం. అలాంటి విప్లవకరమైన అశాంతికి కారకులైన, ప్రమాదకరమైన రచయితలలో చాలా కొద్దిమందిలో ఒకరు రామారావుగారు.

అయితే ఈ అలజడి కలిగించే పని రామారావు గారు పరమ నిదానంగా చేస్తారు. ఆయన కథలు బహునెమ్మదిగా నడుస్తాయి. ఏ మాటా దూకుడుగా వుండదు. ఏ వాక్యమూ కోపంగా నడవదు. మొత్తం కథంతా నిండా నీళ్ళున్న లోతైన చెరువులా, నిశ్చలంగా వుంటుంది.కథ చదివిన పాఠకుడు మాత్రం విపరీతంగా అలజడి పడతాడు.

రామారావు గారు జీవిత సంఘటనల్ని, పాత్రల ప్రవర్తనల్ని, వాళ్ళ మాటల్ని వున్నవి వున్నట్టుగా ఎంతో వాస్తవికంగా రాశారు. రామారావు గారికి మనుష్యుల నైజాల్ని నిశితంగా పరిశీలించే నేర్పు వుంది. కాని అదొక్కటే ఆయనలో చెప్పుకోదగ్గ విశేషమైతే రామారావుగారు మంచి రచయిత అవుతారుగాని గొప్ప రచయిత అవరు. గొప్ప రచయిత కావటానికి అంతకన్నా విశేషం ఏదో వుండి వుండాలి. ఆ సంగతి వివరంగా చూపించటానికి మచ్చుకి రెండు కథలు తీసుకుంటాను. ఒకటి ఆయన రాసిన తొలి కథల్లోది "అభిమానాలు" అనే కథ. రెండోది ఆయన తర్వాత రాసిన కథల్లో అందరికీ ప్రచురంగా తెలిసిన "యజ్ఞం".

''అభిమానాలు'' బ్రాహ్మణ కులం వాళ్ళ కథ. కుటుంబంలోని వాళ్ళు ఒకరి మీద ఒకరు చూపించుకునే అభిమానాలు, వాటి క్లిష్టతలు ప్రధానాంశం. సామాజిక వ్యవస్థలో వున్న వర్గ సంఘర్షణలు, వైషమ్యాలు ఇందులో లేవు. ఇందులో వున్న పాత్రలన్నీ ఒక వర్గానివే. వాళ్ళు తిండికి లేని పేదవాళ్ళు కాదు. అంచేత పేదరికం వల్ల వచ్చే ఇరకాటాలు ఇందులో లేవు. ఇలాంటి కథల వల్ల మన సమాజ వ్యవస్థకి సంబంధించిన తాత్విక అవగాహన కలగదనీ, వీటిలో సామాజిక చైతన్యం వ్యక్తం కాలేదనీ విమర్శకులు అనుకోవటం కద్దు. అయినా ఈ కథని కొంచెం వివరంగా చూస్తే ఏం

తెలుస్తుందో చూద్దాం.

రామారావుగారు కథలు చాలా క్లిష్టంగా రాస్తారు. అంచేత ఆయన కథల్ని తిరిగి నా సొంత మాటల్లో క్లుప్తంగా చెప్పటానికి వీలవదు. కాని ఈ కథలో పాత్రల్ని మాత్రం ఒకసారి జ్ఞాపకం చేస్తాను. పద్మనాభం గారు, ఆయన తమ్ముడు భాస్కరం, పద్మనాభంగారి భార్య లక్ష్మమ్మ గారు, భాస్కరం భార్య రాఘవి, పద్మనాభం గారి కొడుకు చలపతి వీళ్ళు ముఖ్య పాత్రలు. పద్మనాభంగారి ఆడపిల్లలూ, భాస్కరం కూతురు – వీళ్ళు చిన్న పాత్రలు.

ఈ కథ కొంతసేపు చదివాక గాని తెలియదు. పద్మనాభంగారూ, లక్ష్మమ్మ గారూ భాస్కరాన్ని చిన్నప్పటి నుంచి కొడుకులా పెంచి పెద్దచేశారని, భాస్కరం తన తండ్రిలాంటి అన్నగార్ని కాదని రాఘవిని పెళ్ళి చేసుకున్నాడని, ఆ తర్వాత అన్నగారు కక్షపట్టి భాస్కరాన్ని వెలి వేశారని, చివరికి భాస్కరం కూతురు బారసాలకి కూడా వెళ్ళలేదనీ.

సరే ఇది అర్థమైంది. కాని ఇక అసలు విషయం పద్మనాభం గారు తన కొడుకు చలపతిని పట్నంలో హైస్కూలులో చేర్పించారు. ఆ వూళ్ళో ప్రైవేటు మాస్టారి ఇంట్లో వాడికి బస ఏర్పాటుచేశారు. ఆ మేస్టరు ఓ కర్కోటకుడు. వాళ్ళ ఇంట్లో చలపతి నానా కష్టాలు పడుతున్నాడు.

చలపతిని భాస్కరం దగ్గర పెట్టి చదివించొచ్చు. ఈ రెండు కుటుంబాల మధ్య సంబంధాలు సజావుగా వుంటే అదే జరిగేది. తనని కొడుకుగా పెంచి పెద్దచేసిన అన్నగారి కొడుకుని తను తన కొడుకుగా చూసుకుని, దగ్గర పెట్టుకుని చదివించి తను తృప్తి పడగలడు భాస్కరం. ఆ తృప్తి భాస్కరానికి లేకుండా చేశారు పద్మనాభం గారు.

అయితే ఈ కథలో అసలు మెలిక ఏమిటంటే చలపతి పట్నంలో నానా బాధలు పడుతున్నాడని పద్మనాభంగారు గుర్తించరు. వాడి ప్రైవేటు మాస్టారు క్రూరంగా ప్రవర్తిస్తే అది క్రమశిక్షణగా భావిస్తారు. తల్లిదండ్రుల అభిమానాన్ని పొందడానికి వాడు రెండురోజులు సెలవులకి ఇంటికి వచ్చినా వాడిని ఆదరించక క్రూరంగా వెనక్కి పంపించేస్తారు. చివరికి వాడు జబ్బు పడతాడు. సరిగ్గా అదే సమయంలో పద్మనాభంగారి భార్యకు పురిటి రోజులు. ఈ క్లిష్ట పరిస్థితిలో భాస్కరం భార్యతో సహా వెళ్ళి చలపతిని ఆదుకుంటాడు. అప్పటికి పద్మనాభం గారికి తన తమ్ముడి భార్య మంచితనం తెలుస్తుంది. చలపతిని భాస్కరం, రాఘవి తమ వూరు తీసుకెళ్ళడంతో కథ ముగుస్తుంది.

ఈ కథ చెప్పిన తీరువల్ల ఇందులో పాత్రల సంఘర్షణలు, వాళ్ళు బతుకుతున్న కుటుంబ వ్యవస్థ లోపల అభిమానాల ముసుగులో అణచి పెట్టబడిన క్రౌర్యం వ్యక్తమయ్యేట్టు చేశారు రామారావుగారు. ఈ కథలో పాత్రలెవరూ ఒకరితో ఒకరు హాయిగా తమ ఇబ్బందులు చెప్పుకోలేరు. అలా చెప్పుకోడానికి వాళ్ళకు తెలియని సంకెళ్ళేవో వాళ్ళకు అడ్డొస్తాయి. పద్మనాభంగారు భాస్కరానికి తండ్రి స్థానంలో వున్నారు. తన కొడుకు లాంటి భాస్కరం తన ఇష్టాన్ని కాదని రాఘవిని పెళ్ళి చేసుకోవడం ఆయన భరించలేని సంఘటన. అలా తన మీద తిరగబడ్డ కొడుకు మీద అతనికి తగని కక్ష. అది ఆయన వొప్పేసుకుంటే దాని నుంచి ఆయన విముక్తి అయ్యేవాడు. కానీ అభిమానం పేరుతో ఆ కక్షను ఆయన అణగ దొక్కు కుంటాడు. తీర్చుకోలేని, బయట పెట్టుకోలేని ఈ కక్ష ఆయన్ని జంతువుగా మారుస్తుంది. నిస్సహాయుడుగా వున్న తన సొంత కొడుకుమీద ఆయన కసి తీర్చుకోవడం మొదలు పెడతాడు. మళ్ళీ ఇది కూడా ఆయన అభిమానం పేరుతోనే చేస్తాడు. పద్మనాభంగారు తన భార్యతో మాట్లాడేతీరు కూడా మానవ సహజమైన లైంగిక ప్రేమ వ్యక్తమయ్యేలా వుండదు. తనకు భర్త ద్వారా తీరని ప్రేమని ఆవిడ ఏడవడం వలన తీర్చుకుంటుంది. ఈ ఏడుపు, కొడుకు కోసం తల్లి ఏడ్చే ఏడుపుగా, అంటే సమాజం వొప్పుకునే పద్ధతిలో కనిపింపచేసి, ఆవిడ తన కోరికల్ని తీర్చుకుంటూ వుంటుంది.

ఈ ఘర్షణలో నలిగిపోయిన చలపతి లోపలి వేదన చివరికి జబ్బుగా పరిణమిస్తుంది. అంటే సమాజం వొప్పుకునే పద్ధతిలో తీవ్రంగా జబ్బు పడడం ద్వారా మాత్రమే తనకు కావలసిన తండ్రి ప్రేమను తెచ్చుకో గలుగుతాడు చలపతి.

పొడుగ్గా సాగిన ఈ కథలో పాత్రలందరూ పైకి చెప్పుకోలేని, తమలో అణిగిపోయిన తీరని కోరికలతో నలిగిపోతుంటారు. తమలోని ఘర్షణ తమ వాళ్ళ మీద కసిగా మారుతూండగా దానికి అభిమానాల ముసుగు వేసుకుని తమను తాము హింసించుకుంటూ తమ వాళ్ళని హింస పెడతారు. మనుష్యుల మామూలు జీవితంలో చెప్పడానికి పెద్ద సమస్యలు లేని మధ్య తరగతి కుటుంబాలలో ఇంత భయంకరమైన హింస జరుగు తూంటుందని ఈ సమాజం గుర్తించదు.

తరతరాలుగా వస్తున్న ఆస్తుల్ని, వాటి హక్కుల్ని, ఒక పద్ధతిలో రక్షించడం కోసం ఏర్పడిన ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో వ్యక్తి చైతన్యం ఆరోగ్యకరమైన పద్ధతిలో ఎదగదనీ,

బోనులో పెట్టిన జంతువుల్లా మనుషులు ప్రవర్తిస్తారనీ రామారావుగారు గుర్తించారు. ఆ భయంకర పరిస్థితిని చిత్రించిన బలీయమైన కథ ఇది.

కేవలం మధ్య తరగతి కుటుంబంలో అభిమానాలు చిత్రిస్తున్నట్టు అమాయకంగా కనపడే ఈ కథలో అంతర్గతంగా ఒక సామాజిక స్వరూపం వుంది. ఆ సమాజంలో వ్యక్తుల అంతరంగాలను నిర్మించే, నిర్ణయించే భావజాల వ్యవస్థ స్వరూపం వుంది.

ఈనాటికీ ఈ సమాజంలో మానవ వ్యక్తి ఆరోగ్యకరంగా ఎదగడానికి కావలసిన మానసిక అవసరాల పట్ల, లైంగిక అవసరాల పట్ల సరైన గుర్తింపు లేదు. శారీరకమైన జబ్బులు, ఆర్థికమైన ఇబ్బందులు వీటిని గురించి మాట్లాడ్డానికి ఈ సమాజం వొప్పుకుంటుంది కానీ, కామాన్ని గురించి మాట్లాడ్డానికి వొప్పుకోదు. అంచేత మనం అభిమానాల పేరుతో చూపించే హింసను కూడా హింసగా గుర్తించడానికి వొప్పుకోదు. ఇంకా అంతకన్నా ముఖ్యం ఈ అనారోగ్యకర వ్యవస్థకంతటికి ఆస్తుల వ్యవస్థ. ఉత్పత్తి సంబంధాలు – ఇవి బలీయమైన మూల కారణాలుగా వున్నాయనీ వొప్పుకోదు. అయినా కొంత నయం. ఆర్థిక రాజకీయ సమస్యల గురించి మాట్లాడ్డానికి కనీసం సామాజికమైన వొప్పుదల వుంది. క్రమంగా రామారావుగారు ఈ క్లిష్ట సంఘర్షణల సామాజిక అనారోగ్యానికి మూల కారణాలు గుర్తించడం మొదలుపెట్టారు. 1964 తరువాత ఆయన రాసిన కథలన్నిటిలోనూ ఈ గుర్తింపు వలన కలిగిన పరిణామం కనిపిస్తుంది. ఆ కథల్లో గొప్ప కథలు చాలా వున్నాయి – 'యజ్ఞం', 'ఆర్తి', 'భయం', 'చావు', 'నో రూమ్'.

వీటిలో 'యజ్ఞం' కథమీద విశేషమైన చర్చలు జరిగాయి. కథా యజ్ఞం (1982 హైదరాబాద్ బుక్ ట్రస్ట్) 'యజ్ఞం' మీద చాలామంది విమర్శకులు రాసిన వ్యాసాల సంపుటి. అంతకన్న ముందు రంగ నాయకమ్మగారు 'యజ్ఞం' మీద చాలా విమర్శనాత్మకమైన వ్యాసం రాశారు. (ప్రజాసాహితి – సెప్టెంబరు – 1977). కథాయజ్ఞం ప్రచురించబడిన తరువాత రంగనాయకమ్మ గారు మరొక వ్యాసం రాసి (1982 – డిసెంబరు) రెండు వ్యాసాలూ కలిపి ఒక పుస్తకంగా ప్రకటించారు. ('యజ్ఞం' కథ మీద రెండు వ్యాసాలు – విజయవాడ – స్వీట్‌హోమ్ పబ్లికేషన్స్ 1983). ఇంత విపులమైన చర్చ ఒక్క కథమీద జరగడం తెలుగు సాహిత్య చరిత్రలో అపూర్వం. ఇంత చర్చ జరిగిన మీదట ఈ కథ మీద ఇంకా చెప్పవలసిన కొత్త సంగతులు వున్నాయా అంటే – వున్నాయనే అనిపిస్తోంది.

ఈ కథ మీద విమర్శకులలో చాలా తీవ్రమయినది రంగనాయకమ్మ గారు చేసినది. ఆవిడ అభిప్రాయంలో ఇది చాలా లోపభూయిష్టమైన కథ. ఆవిడ మాటల్లో చెప్పాలంటే – "రచయిత అవగాహనలో అనేకమైన పొరపాట్లు ఉండడం వల్ల ఇది పేదలకు ఏమీ ప్రయోజనాన్ని ఇవ్వలేని కథ అయిపోయింది".

రంగనాయకమ్మగారి విమర్శ క్లుప్తంగా ఈ కింది మూడు అంశాల మీదా ఆధారపడింది. 1. రచయిత శ్రీరాములు నాయుణ్ణి తీవ్రమైన వైరుధ్యాలతో చిత్రించారు. ఒకపక్క అతను గాంధీవాదం పట్ల విశ్వాసం వున్న ఆదర్శ నాయకుడుగానూ, ఇంకొక పక్క అతను మోతుబర్ల కొమ్ముకాసే కపటిగానూ – రెండు రకాలుగానూ కనిపిస్తాడు. దీనికి కారణం రచయితకి గాంధీవాదం పట్ల స్పష్టమైన అవగాహన లేకపోవడం. గాంధీ నిజాయితీ పరుడైన వాడనీ, ఆయన కేవలం ధనిక వర్గానికే ఉపయోగపడ్డాడనీ రెండు పరస్పర విరుద్ధ దృక్పధాలున్నాయి. రచయితకి. 2. అప్పల్రాముడికీ గోపన్నకీ వర్గ వైరుధ్యం లేదు. ఇద్దరూ పేదవారే. ఒక పేద రైతుకీ, మరొక పేద షావుకారుకీ అప్పు తగాదా పెట్టి, అది వర్గ వైరుధ్యంగా – అప్పులిచ్చిన వాళ్ళకీ, అప్పులు పుచ్చుకునే వాళ్ళకీ తగాదాగా చిత్రించడం పొరపాటు. 3. కథ ముగింపు జుగుప్సా కరంగా వుందేకాని, కథకి ఏమీ ఉపయోగకరంగా లేదు.

రంగనాయకమ్మగారి అభిప్రాయంలో 'యజ్ఞం' కథ వర్గ చైతన్యానికి ఉపయోగపడాలంటే ఇంకో విధంగా వుండాలి.

1. శ్రీరాములు నాయుడికి అమాయకమైన మంచితనం కారణంగా గాంధీ వాదం పట్ల భ్రమలు వుండాలి.

2. గాంధీవాదం పేద ప్రజలకి మేలు చెయ్యలేక పోయిందని అతను కథా క్రమంలో తెలుసుకోగలిగి వుండాలి.

3. అప్పల్రాముడికి అప్పు ఇచ్చినవాడు ధనికుడైన, దుష్టుడైన షావుకారు అయి వుండాలి.

4. కథ ముగింపు వర్గ చైతన్యానికి తోడ్పడేదిగా వుండాలి.

ఇలాంటి కథ బాగా రాస్తే అది వర్గ పోరాటానికీ, విప్లవోద్యమానికీ సమర్థంగా ఉపయోగిస్తుందనడంలో నాకేమీ సందేహం లేదు. రంగనాయకమ్మ గారు ఈరకమైన విమర్శ చెయ్యడంలోనూ, కథ బాగుపడడానికి ఈరకమయిన సూచనలు ఇవ్వడంలోనూ, ఒక నిర్దిష్టమైన విమర్శ విధానాన్ని అనుసరిస్తున్నారు. ఆవిడ అనుసరించిన విమర్శ విధానంలో

లోపం వుందని చెప్పడానికి ఏమీ అవకాశం లేదు.

ఒక ఉద్యమం ఒక నిర్దిష్ట విలువలతో సమాజాన్ని సమూలంగా మార్చే ఆశయంతో సాగుతుననప్పుడు, సాహిత్యం ఆ ఉద్యమంలో భాగం అవాలనీ, రచయితలు ఆ ఉద్యమ ప్రయోజనాలకి అనుగుణంగా సాహిత్యాన్ని సృష్టించాలనీ, ఆ ఉద్యమంలో వున్న విమర్శకులు కోరతారు. చదివే వాళ్ళకి స్పష్టంగా, సులభంగా తెలియవలసిన మార్గం తెలియాలి. తెలుపేదో, నలుపేదో ఖచ్చితంగా విడిపోయి కనిపించే పాత్రలతో, అంతరార్థాలూ, గూఢార్థాలూ లేని శైలిలో రచనలు చెయ్యాలి. ఇలా మార్గదర్శక సూత్రాలు నిర్దేశించినంత మాత్రాన – ఆరకంగా నిర్మించబడిన సాహిత్యం చవకబారు ప్రచార సాహిత్యం అయిపోదు. ఆ ఉద్యమపు విలువలతో తన చైతన్యాన్ని రంగరించుకున్న మంచి రచయితలు వుంటే – వాళ్ల చేతిలో ఈ రచనా సూత్రాలు బలీయమైన కళాత్మక రూపం పొంది ఉత్తమ సాహిత్య నిర్మాణానికి ఆలంబనం అవుతాయి.

మార్క్సిస్టు ప్రచారం చేసే సాహిత్యం అంటే ఇష్టంలేని వాళ్ళు ఈ విషయంలో రుజువు కోసం హైందవ భక్తి సాహిత్యాన్ని పరిశీలించొచ్చు. ఉదాహరణకి భాగవత పురాణం చూడండి. హిరణ్యకశిపుడు రాక్షసుడూ, ప్రహ్లాదుడు భక్తుడూ నిక్కచ్చిగా అయితీరాలి. అందులో ఎక్కడా అనవసరమైన క్లిష్టతలు వుండకూడదు. హిరణ్యకశిపుడు తన తండ్రి అయినాసరే, ప్రహ్లాదుడు విష్ణువు పక్షంచేరి అతన్ని క్రూరంగా చంపించాలి. ఈ కథలో ఎవరు దుష్టులో ఎవరు శిష్టులో స్పష్టంగా తెలిసిపోవాలి. దుష్ట శిక్షణ ఎవరు ఎలా చేస్తారో కూడా ఖచ్చితంగా వర్ణించబడాలి.

భాగవతం మంచి సాహిత్యం కాదనీ, కేవలం చవకబారు ప్రచార సాహిత్యం అనీ అనడం కుదరదు. అలాగే వర్గ పోరాటం స్పష్టంగా బోధపరిచే కథలు, ఎన్న తగినవి, తెలుగులో చాలా వున్నాయి. రావిశాస్త్రి గారి "వేతన శర్మ", ఆయనదే "పిపీలికం" మంచి సాహిత్యంలో చేరదగినవి కావని ఎవరూ అనలేరు. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, రంగనాయకమ్మ గారి విమర్శ విధానాన్ని దృష్టిలో పెట్టుకుని, ఆవిడ సూచనల ప్రకారం ఎవరేనా మంచి రచయిత కథరాస్తే – అది కూడా తప్పకుండా గొప్ప కథ అయ్యేందుకు వీలుంది.

ఎటొచ్చీ రామారావుగారు అలాంటి కథ రాయలేదు. ఆయన వేరే రకం కథ రాశారు.

మంచి సాహిత్యం ప్రధానంగా రెండు రకాలు. ఒకటి – ఉండవలసిన పరిస్థితి ఎలా వుండాలో చెప్పేది. రెండోది – ఉన్న పరిస్థితి ఎలా వుందో చూపించేది. మొదటి రకం – ఒక దారిని స్పష్టంగా నిర్దేశించి, చదివే వాళ్ళకి ఆ దారిని నడవమని ప్రోత్సహిస్తుంది. రెండో రకం సాహిత్యంలో అలాటి దారి స్పష్టంగా కనిపించదు. అది ఉన్న పరిస్థితిని ఉన్నంత క్లిష్టంగానూ ప్రదర్శిస్తుందంతే. మొదటి రకం సాహిత్యంలో పాఠకుడు ఆలోచించవలసిన దానికన్నా అనుసరించడానికే ప్రాధాన్యం. రెండో రకం సాహిత్యంలో పాఠకుడు ఆలోచించవలసిందే ఎక్కువ వుంటుంది.

ఈ విభజన ప్రాధాన్యతల దృష్టిలో చేసిన విభజనేకాని, రెండు ముక్కలుగా సాహిత్యాన్ని విడగొట్టడానికి చేసిన విభజన కాదు. అంటే – ఉండవలసిన పరిస్థితి చెప్పే సాహిత్యంలో కూడా ఉన్న పరిస్థితికి సంబంధించిన సమాచారం పుష్కలంగా వుంటుంది. కాని ప్రాధాన్యం మాత్రం ఉండవలసిన స్థితిని నిర్దేశించే పనిదే. అలాగే ఉన్న పరిస్థితిని చెప్పే సాహిత్యంలో కూడా – ఉండవలసిన స్థితికి సంబంధించిన సూచనలు వుంటాయి. కాని అవి ఎట్టఎదుట కన్పించవు.

రామారావుగారి కథలు చాలా భాగం, ముఖ్యంగా "యజ్ఞం", ఉన్న పరిస్థితిని చెప్పే కథలు. రంగనాయకమ్మగారి విమర్శ విధానం, ఈ కథలకి నప్పదు. ఇది ఆ విమర్శ విధానంలో లోపం కాదు. ఆ విమర్శ విధానాన్ని, అది వర్తించని వేరే రకమయిన సాహిత్యానికి వర్తింపజెయ్య బోవడం పొరపాటు – అంతే.

ఇకపోతే, రామారావు గారు కథ నిర్మించే తీరులో ఒక ప్రధానమైన క్లిష్టత వుంది. అది దాదాపు ఆయన కథలకే వర్తించే క్లిష్టత. రామారావు గారు రచయితగా తన కథల్లో తరుచు కనిపించరు. "యజ్ఞం"లో అసలు కనిపించరు. ఆయన తన కథా వివరణ కోసం ఒక వక్తని వేరే తయారు చేస్తారు. మామూలుగా రచయిత మాటల్లా – తరుచు తెలుగు కథల్లో కనిపించే మాటలన్నీ ఈ వక్తవి. కథలో సంఘటనలనీ, ఇతర సమాచారాన్నీ మనకి వ్యాఖ్యానించే ఈ వక్తకీ, కథలో ఇతర పాత్రలకీ వెనకాతల రచయిత రామారావుగారు వుంటారు. ఈ సంగతి బోధ పరుచుకోకపోతే, ఈ కథలో వక్తమాటలు రచయిత మాటలే అనుకునే ప్రమాదం వుంది. కథలో పాత్రలకి గాని, ఈ వక్తకి గాని లేని అవగాహన రచయితకి మాత్రం వుంటుంది. ఈ అవగాహన పాఠకుడికి అందడానికి కథ అంతా సావధానంగా, పూర్తిగా చదవాలి. రెండుసార్లు చదవాలి. మొదటిసారి చదివేటప్పుడు పాత్రల మాటల, వక్త

వ్యాఖ్యానాల పై పై అర్థాలు మాత్రమే తెలుస్తాయి. రచయిత ఈ కథలో అడుగున ఉద్దేశించిన తాత్విక అవగాహన అందుకున్నాక, రెండోసారి చదువుతూంటే, అప్పుడు ప్రతి పాత్ర మాటలకీ, కథలో వక్త చేసే వ్యాఖ్యానాలకీ వెనక వున్న రచయిత కనిపిస్తాడు. ప్రతి మాటకీ, అప్పుడు – మొదట స్ఫురించని రెండో అర్థం స్ఫురిస్తుంది.

రామారావు గారు కథ మనకి చెప్పరు. కథ జరుగుతూంటే, ఆ జరుగుతున్న క్రమంలో జరుగుతున్న సంఘటనలే మనకి కథ చెప్పేలా చేస్తారు. అకస్మాత్తుగా ఒక ఆగంతకుడు సుందరపాలెం ప్రవేశిస్తాడను కోండి. అతనికి అక్కడి సంగతులు వినగా, చూడగా క్రమక్రమంగా కథ బోధపడుతుంది. రామారావుగారి కథ చదవడం అంటే, అలా ఆగంతకుడిలా ఒక పరిస్థితిలో ప్రవేశించి క్రమక్రమంగా జరుగుతున్న సంగతులు ఎప్పటివి అప్పటివి వింటూ మొత్తం కథ తెలుసుకోవడం.

ప్రతి సమాజంలోనూ ప్రతి దశలోనూ ఒక భావజాలానికి లోబడిన మాటలు గౌరవార్థంలో వాడబడుతూంటాయి. ఆ మాటకి మామూలు మనుషులు లోబడి ప్రవర్తిస్తారు. రామారావుగారి కథల్లో మాటలకి అర్థాలు ఆ భావజాలపు వ్యవస్థని చూపించే పనిలో జాగ్రత్తగా వాడినవి.

'యజ్ఞం'లో, ఉదాహరణకి, రచయిత చెప్పినట్లు కనిపించే మాటలన్నీ ఇవే. ఈ కథ జాగ్రత్తగా చదివి చూడండి. మనం పూర్తిగా కొత్త వాళ్ళంగా సుందరపాలెంలో ప్రవేశిస్తాం. ఆ వూరు గురించి తొలిగా మనకి తెలియవలసిన సంగతులు ముందు తెలుస్తాయి. ఆ తరవాత అప్పల్రాముడిని గురించి నాలుగు మాటలు తెలుస్తాయి.

"మాటకు నిలబడేవాడూ, మర్యాదగా బతకాలనుకునే వాడూ మాలల్లో అతనొక్కడేనని అందరూ చెప్తారు".

ఆ తరవాత మాజీ షావుకారైన గోపన్న గురించి తెలుస్తుంది. "అతను పరమ సాత్వికుడు. గొప్ప ఓర్పు కలవాడు. ఒకప్పుడు ఘనంగా బతికి ఇప్పుడు చితికిపోయిన పెద్ద మనిషి. వీళ్ళిద్దరూ తుమ్మకొయ్యల్లా వుండేవారట పూర్వం. ఈనాటికి పేదతనం వాళ్లను రచ్చకెక్కించింది అని నొచ్చుకుంటున్నారు తెలిసిన వాళ్ళంతా".

ఇందులో ఏ అభిప్రాయమూ రచయిత చెప్పింది కాదనీ, రచయిత నిర్మించిన వక్త చెప్పినవే ఇవన్నీననీ గుర్తుంచుకోండి. పైగా ఈ మాటలన్నీ ఆ సమాజంలో వున్న భావజాల వ్యవస్థ గౌరవకరంగా తయారు చేసిన మాటలు. మాటకి నిలబడడం, మర్యాదగా బతకటం, సాత్విక గుణం, ఓర్పు, ఒకప్పుడు ఘనంగా బతికి ఇప్పుడు చితికిపోవడం, పేదతనం వల్ల రచ్చకెక్కవలసి రావడం – ఇవన్నీ ఒక పరిమిత వ్యవస్థలో గౌరవకరమైన మాటలు. ఆప్యాయంగా తప్పు తూనికలు తూచి, తప్పు లెక్కలు చెప్పి అప్పు ఇవ్వవలసిన స్థితికి ఒక మాలవాణ్ణి మరొక షావుకారు తీసుకొచ్చాడన్న సంగతి బయట పెట్టడానికి ఈ వ్యవస్థలో మాటలు లేవు. అంచేత ఈ కథలో వక్త ఆ మాటలు చెప్పడు కూడా. ఆ సంగతి పాఠకుడికి ఆలోచన వల్ల తెలియాలి. ఇందులో 'అన్యాయం' వ్యక్తం కూడా అవడానికి వీల్లేనంతగా ఆనాటి ధర్మపు ఊబిలో కూరుకుపోయిందని, అందులో అందరూ దిగబడి పోయారని రచయిత ఎక్కడా నోరు విడిచి చెప్పడు. కాని కథ వల్ల – పాఠకుడికి తెలియవలసింది ఇదేనని రచయితకి తెలుసు.

ఇంకా కథ చదివితే తెలుస్తుంది. శ్రీరాములు నాయుణ్ణి గురించి, అతను ఆ ఊరికి తెచ్చిన కొత్త న్యాయ వ్యవస్థని గురించి. "పదిహేనేళ్ళ క్రితమైతే ఆ తగువు తీర్చడానికి వాళ్ళకింతసేపు పట్టదు. శ్రీరాములు నాయుడు వచ్చి అంతా మార్చేశాడు. ఈయన అన్నింటికీ శాంతమే నంటారు". అంటే పదిహేనేళ్ళ క్రితం ఊరి షావుకార్లు నాలుగు తన్ని మాలవాడి దగ్గిర్నుంచి అప్పు వసూలు చేసేవారు. అప్పుడు మాలవాడికి తెలిసిపోయేది ఆ వూళ్ళో తన స్థానం ఏమిటో. కాని శ్రీరాములు నాయుడు స్థాపించిన న్యాయవ్యవస్థ అదంతా మార్చి మాలవాళ్ళని ఒక మాయలో పెట్టింది. అయితే ఈ సంగతి పాఠకుడికి వెంటనే తెలియదు. శ్రీరాములు నాయుడు పెట్టిన మాయలోనే పాఠకుడు కూడా వుంటాడు అప్పటి వరకూ. క్రమంగా కథ నడుస్తుండగా తెలుస్తుంది. శ్రీరాములు నాయుడు ప్రవర్తన అక్షరాలా ఆ నాటికి పెద్ద మనిషి తరహా అనిపించుకునే మాటల్తో పాఠకుల్ని కూడా ఆకట్టుకుంటుంది. ఆయన వ్యక్తిగత జీవితాన్నీ, సంఘ బాధ్యతల్నీ క్లిష్ట పరిస్థితుల్లో సమన్వయించుకుంటూ "ప్రజాభిమానమా, సీతాదేవా అంటే తడుముకోకుండా జవాబిచ్చిన ఆనాటి శ్రీరామ చంద్రుడిని" ఆదర్శంగా పెట్టుకుని అందుకు తూగలేక పోయినందుకు గ్రామ ప్రజలకు క్షమార్పణ చెప్పుకునేటంతటి ఉన్నత వ్యక్తి.

క్రమంగా తెలుస్తుంది శ్రీరాములు నాయుడు కట్టించిన న్యాయ మండపం సంగతీ, ఆ వూరు ఆదర్శ పంచాయతీ అవడం ఇలాటి సంగతులు. ఇవీ పాఠకుడికి చాలా గౌరవకరమైన భావజాలపు ఉచ్చుల్లో వున్న మాటలే. కథ చివరి వరకూ చదివిన పాఠకుడికీ తెలుస్తుంది ఇవన్నీ రచయిత

ఒక ఉద్దేశంతో చెప్పిన మాటలేనని. కాని ఆ క్షణానికి ఇది పాఠకుణ్ణి కూడా ఆ ఉచ్చులో అట్టే పెడతాయి.

ఇంకా వుంది. ఆ వూరికి శ్రీరాములు నాయుడు తెచ్చిన అభివృద్ధి స్కూలు, రోడ్లు, ఆ స్కూలుకి ఆ వూరి పెద్ద షావుకారు, నిలవ ధనంలోంచి కాణీ కదపని సూర్యంగారు, ఇరవై వేలు విరాళం ఇవ్వడం. కాని ఇది జ్ఞానం కాబట్టి గొప్ప విరాళం. అది సాధించిన శ్రీరాములు నాయుడు మహత్యం వల్ల జరిగిన మార్పు అది. అంతే అనుకుంటాడు పాఠకుడు.

గోపన్నకి ఈ న్యాయ మండపం మీద విశ్వాసమూ అంత గౌరవకరమైన మాటల్లోనే బయటికి వొస్తుంది. తను కోర్టుకి చచ్చినా వెళ్ళనని ప్రతిజ్ఞ చేస్తాడు గోపన్న.

తగువు ముదిరి, మర్యాదల ముసుగు తొలగి జనంలోంచి వొచ్చిన ఒక అనామకుడు, శ్రీరాములు నాయుడి దూరపు బంధువు అన్నయ్య కాస్త దురుసుగా "ఎదవ నాకొడుకుల్లారా మీ బాబుగారి సొమ్మా? మీ తాతగారి సొమ్మా? ఇవ్వకెక్కడికి పోతారు. తంతాం" అని ఒక్కడూ అడగడేం అని పెద్ద మనుషుల మీద నోరు చేసుకునేసరికి అప్పల్రాముడు చుట్టం, పేరు లేని వాడొకడు అతన్ని మర్యాదగానే కనిపించే మాటల్లో మందలించి "ఆ పత్రం కోర్టుకెల్తే ఏంవవుద్దో తంవకు తెలియక పోవచ్చుగాని ఆరికి బాగా తెలుసు" అని ఒక మాట బయట పెట్టేసరికి కథలో లోపలి పొర ఒకటి వుందని తెలుస్తుంది.

ఈ మర్యాదల మప్పితాల ధర్మపన్నాల మాటల పై మెరుగుల కింద వున్న అసలు రంగు కాస్త కనిపించేసరికి పాఠకుడు ఉలిక్కిపడతాడు. ఈ సంగతి బయట పెట్టే పని ఎవరో అనామకులూ, దూరపు చుట్టాలూ చేస్తారే గాని కథలో పెద్ద పాత్రలెవరూ చెయ్యరని గమనిస్తాడు పాఠకుడు. కాని శ్రీరాములునాయుడు "అరాచకాన్ని" సహించడు అని చెప్తాడు కథ చెప్పే వక్త. భావజాలం బద్ధలవడానికి కథలో మొదటి సూచన అదే. అన్యాయాన్ని బయట పెట్టేది "అరాచకం" అయితే, "రాచకం" అన్యాయాన్ని కప్పిపెడుతూందా ఏమిటి చెప్మా అని పాఠకుడికి సందేహం కలుగుతుంది అయినా పదిమందీ ఒక దారితెన్నూ లేకుండా గోలగోలగా ఉద్రేకాలు ప్రదర్శించుకోవడం అరాచకమే అనే పాఠం నిత్య జీవితంలో నేర్చుకున్న పాఠకుడు, ఈ కథలో వక్త వాడిన "అరాచకం" అనే మాట బలానికి లొంగిపోయి కథ చదువుతాడు.

అప్పల్రావుడే స్వయంగా – "బాబయ్యా అది అప్పో, అప్పుకాదో, అయితే ఏనాటి అప్పో, ఎలాతేలిన అప్పో, అదంతా సదువుకోని మొద్దులం మాకు తెలీదు, పెద్దలు తంవరున్నారు ఆపైని శ్రీరాంవులు బాంవున్నారు. తంవరాలోసించి సెప్పాల" అని "శాంతంగా" అనేసరికి కథ నిజంగా లోతవుతుంది.

దీనికి శ్రీరాములు నాయుడి సమాధానం భూస్వామ్య సమాజపు భావజాల వ్యవస్థలో తగువులు తీర్చబడే పద్ధతికి అమోఘమైన ఉదాహరణ.

శ్రీరాములు నాయుడు వెంటనే – అప్పల్రాముడితో "గోపన్నకి నువ్వు ఏం బాకీ లేవని" చెప్పేసి, గోపన్నతో "మీరు ఎల్లుండి కనపడండి – మీ నోటు చెల్లుపెడతానని అని, సభ ముగించబోతాడు. ఆయన ఎందుకిలా అన్నట్టు? ఇది కోపం – అయినా కోపంలా కనిపించదు. నిజానికి ఆ మాటని అలాగే నిలబెట్టుకోమని అప్పల్రావుడు అమాయకత్వం నటించి ఇంటికి వెళ్ళిపోతాడనుకోండి. ఇక అతను ఆ వూళ్ళో బతకలేడు. ఇదేం తీర్పు. ఇందులో న్యాయాధికారి వివాదంలో భాగస్వామి అయిపోయి, అప్పు తీర్చని వాడి తరఫున తను అప్పు తీరుస్తాడన్న మాట. ఇది అప్పు కాదని ప్రకటిస్తే అది నిజమైన న్యాయం. అది అప్పల్రావుడు కోరుకునేదీ, ఆ సమాజ వ్యవస్థ బాగుపడడానికి కావలసినదీని. కాని ఆ వ్యవస్థని "శాంతంగా" నిలబెట్టాలని కంకణం కట్టుకున్న శ్రీరాములు నాయుడు తనకి అదనంగా త్యాగమూర్తి పేరు తెచ్చుకుని తను అప్పు తీరుస్తానంటాడు. ఇందువల్ల ఆ తప్పుడు అప్పుల వ్యవస్థ కాపాడబడుతుంది. దానికి తోడు శ్రీరాములు నాయుడికి ధర్మరాజు అనే పేరొస్తుంది. అప్పల్రావుడికి ఆ వూళ్ళో పరపతీ, ప్రతిష్ఠా లేకుండా పోతుంది.

ఇంత జరగబోయే మాట శ్రీరాములు నాయుడు అన్నాడని అప్పల్రావుడికి తెలుసు. ఆ వూళ్ళో, ఆ వ్యవస్థలో తల పండిన అప్పల్రావుడికి ఆ మాత్రం తెలియక పోలేదు. ఎటొచ్చీ పాఠకుడికే అది బోధపడడానికి కొంతసేపు పడుతుంది.

ఆ తరువాత బోలెడు మెలికలు తిరిగిన మాటల చక్రబంధాల ఫలితంగా అప్పల్రావుడు రూఢి చేసుకుంటాడు. అతను జ్ఞానోదయం అయిన వాడిలా అంటాడు శ్రీరాములు నాయుడుతో "నీ దెబ్బన్నది తగిలిన సోట కనపడదు. నువ్వేం జేసినా సాపకింద నీరులాగ సల్లగ ముంచుతావు". ఇక్కణ్ణుంచి మొదలు – కథలో శ్రీరాములు నాయుడు ఏర్పరచిన గాంధీ తరహా శాంత విధానమూ, గ్రామాభివృద్ధీ, వాటికి అంతకు ముందున్న గౌరవ స్థానాన్ని కోల్పోవడం మొదలవుతుంది. అప్పల్రావుడు నెమ్మదిగా అయినా శ్రీరాములు నాయుడు తొడుక్కున్న కోటు పొరలు పొరలుగా వొలిచెయ్యడం మొదలు

పెడతాడు. అప్పల్రావుడు చివరికి ఇది న్యాయమైన అప్పేనని శ్రీరాములు నాయుడి చేత అనిపించమని నిలదీసే సరికి శ్రీరాములు నాయుడు అజాగ్రత్తగా బయట పడిపోయి "ఇది అప్పే! అప్పే! అప్పే!" అనేస్తాడు ఉద్రేకంగా. అది గమనించేసిన అప్పల్రావుడిని మభ్యపరచడానికి మళ్ళా అతి పురాతనమైన కర్మ సిద్ధాంతాన్నీ, పునర్జన్మ సిద్ధాంతాన్నీ వాడుకుని – అప్పూ పాపమూ ఒకటేననీ, కోర్టుకు వెళ్ళి గెల్చినా ఈ రుణం ఎప్పటికీ తప్పించుకోడానికి వీల్లేదనీ, ఈ జన్మలో కాదు ఇంకో జన్మలో కూడా తీర్చక తప్పదనీ – బహు హుందాగా ఉపదేశిస్తాడు.

ఈ దెబ్బతో అటు అప్పల్రావుడికీ, ఇటు పాఠకుడికీ కూడా ఈ వ్యవస్థ ఎవరి ఎవరి వేపు పనిచేస్తుందో బోధపడిపోతుంది. ఆ తరవాత, అనుభవంలో తననూ తనలాంటి వాళ్ళనీ ఉపయోగించుకుని అభివృద్ధి పేరుతో, శాంతి అహింసల పేరుతో పైకి వచ్చిన వాళ్ళెవరో – ఏ మార్క్సిస్టు ఆర్థికవేత్తకి తెలియరానంత స్పష్టంగా అప్పల్రావుడు చూడ గలుగుతాడు. ఆ ఉపన్యాసం లాంటి మాటల్లో – ఒక జీవితం నేర్పిన అనుభవమూ, ఆ క్షణంలో కలిగిన అవగాహనా రెండూ వున్నాయి. పైగా పాఠకుడు ఈ విషయం బోధపరచుకోడానికి సిద్ధంగా వున్నాడు కూడా.

అయితే, ఈ సమాజంలో మోసపోయిన వర్గంలో వాడైనా అప్పల్రావుడి మీద ఇంకా ఈ వర్గ సమాజపు భావజాల వ్యవస్థ పెట్టిన బరువు ఇంకా అలానే వుంది. అందుకే స్పష్టంగా అయినా మర్యాదగానూ, కరుగ్గానే అయినా నమ్రంగానూ వుంటాయి అతని మాటలు.

అతనికి శ్రీరాములు నాయుడు నాయకత్వం వహించిన వ్యవస్థలోని అన్యాయం బోధపడినా, దాన్ని మార్చడానికి కావలసిన ధైర్యమూ లేదు, మార్గమూ తెలియదు. పైగా కథాంతాన కొడుకుని చంపుకున్న సీతారాముడు చెప్పినట్టు అప్పల్రావుడిలో జీర్ణించుకుపోయిన ఒక గుణం వుంది. అతనికి జనం మెప్పు కావాలి. "అప్పల్రావుడు శాన మంచోడు. ఆడి తప్పనోడన్న మాట కావాల, అమాయకుడన్న పేరు కావాలి. నీ బిడ్డ పాపలెలాగట పోనీ".

ఈ కథ ముగించిన తీరు చాలామందిని కలవరపరిచింది. కాని అందులో బలీయమైన నిజం వుంది. ఆర్థిక వ్యవస్థ, దాన్ని అనుసరించిన, అంతకన్నా బలీయమైన భావజాల వ్యవస్థ ఈ మనుషుల్ని శతాబ్దాల పాటు అణిచిపెట్టి, దారిలేని పరిస్థితిలో పెట్టినప్పుడు, ఆ పీడన నుంచి బయట పడడానికి చేతకాని క్రోధం పెల్లుబికినప్పుడు, మనుషులు తమని తామే హింసించుకుంటారు.

ఈ కథలోనే కాదు – రామారావుగారు చాలా కథల్లో ఇలాంటి పరిస్థితినే చూపించారు. "నో రూమ్" కథలో అతృప్త కామం – సరిగ్గా ఆర్థిక వ్యవస్థలాగే మనిషిని కుంగదీస్తుంది. సమాజపు నీతి వ్యవస్థ (భావజాల వ్యవస్థలో ఇదీ ఒక భాగమే) మనిషిలో సహజమైన, ఆరోగ్యకరమైన కోరికలకి భరించరాని అన్యాయం చేస్తుంది. అప్పుడు ఆ అన్యాయానికి గురైనవాడు చేసేదేమిటి? సరిగ్గా తనలాంటి అనుభవమే వుండి, తన కష్టాన్ని అర్థం చేసుకున్న వాడూ, సానుభూతితో అడిగిన వాడూ అయిన దేవుడనే ముసలివాడిని కలబడి కొట్టెయ్యడం. ఇంకా వెనక్కెళ్ళి చూస్తే "అభిమానాలు" కథలో కూడా అంతే. తన లోపల అణిచి పెట్టబడిన ఆవేశాలకి దారిలేక పద్మనాభం గారు తన కొడుకునే హింసించుకుంటారు.

రామారావుగారి కథల్లో సమాజంలో మనుషులు ప్రవర్తించే తీరు కేవలం నిజంగా వుండడమే కాదు, సమాజపు భావజాల వ్యవస్థ దాని బరువు కింద కనిపించకుండా అణిగి వున్న సామాజిక వ్యవస్థా వ్యక్తమవుతాయి. అంత గాఢంగా సమాజం అడుగున వున్న నిజాన్ని చూపిన రచయితలు ఏ సాహిత్యంలోనూ ఎంతో మంది వుండరు.

రామారావుగారి కథలు దాదాపు ఏవీ పైకి తెలిసిపోవనీ, పురాతన చరిత్ర కోసం భూమి పొరలను తవ్వే ఆర్కియాలజిస్టు పొర పొరా వేరు వేరుగా విడదీసి చూపేదాకా చరిత్ర సమాచారం ఆవిష్కృతం కానట్టు – ఆయన కథలు కూడా, పొర పొరా జాగ్రత్తగా విప్పితే కాని కథలో ఏ మాట ఎందుకు అన్నారో బోధపడదనీ, ఆ కథ రెండోసారి చదివేటప్పుడు – అంతకు ముందు, మొదటిసారి చదివినప్పుడు తోచని లోతులు, గూఢార్థాలు తెలుస్తాయనీ మరొకసారి చెప్పడం అవసరం – ప్రతి కథనీ ఈ పీఠికలో ఇంత వివరంగా పరిశీలించడం సాధ్యం కాదు కాబట్టి, ఈ దృష్టితో ఆయన మిగతా కథలు కూడా చదవండి మరోసారి.

రామారావుగారి కథలు చదివించవని చాలామంది అంటే, అలా తప్ప మరోలా రాయలేక పోయానని ఆయన వినయంగా అన్నారు. ఆ మాటలకీ, ఆ వినయానికీ అర్థమేమిటంటే, ఆ కథలు అలానే రాయాలి అని. నాకు తెలిసిన ప్రపంచ సాహిత్యంలో రామారావుగారిలా కథ చెప్పే వాళ్ళు ఎంతోమంది లేరు. ★

–వెల్చేరు నారాయణరావు

అక్టోబరు, 1986

# కాళీపట్నం రామారావు నేపథ్యం 1924-48



**కాళీపట్నపు వేంకట సూర్య రామ సుబ్రహ్మణ్యేశ్వరరావు**
**(1938-ఫోర్త్‌ఫారం)**

1924 నవంబరు 9వ తారీఖున ప్రస్తుత శ్రీకాకుళం జిల్లాలోని 'పొందూరు' గ్రామంలో – అమ్మమ్మ గారి యింట్లో–కాళీపట్నం రామారావు జన్మించారు. తల్లి భ్రమరాంబ తండ్రి పేర్రాజుల అయిదుగురి సంతానంలో అందరికన్న పెద్దవారు.

పేర్రాజు మురపాక గ్రామ కరణం. ఆ వూరిలోనే వారికి గృహ వసతి, కొద్దిగా భూవసతీ ఉన్నాయి. మురపాక గ్రామం అటు సముద్రానికి మూడు మైళ్ళూ, కలకత్తా మద్రాసులను కలిపే జాతీయ రహదారికి మూడు మైళ్ళుగా ఉంటుంది. అప్పటి షేర్ మహమ్మద్ పురం ఎస్టేట్ గ్రామాల్లో మురపాక ఒకటి.

శ్రీకాకుళం జిల్లా ఎక్కువ భాగం వర్షాల మీదా, చెరువుల మీదా ఆధారపడిన ప్రాంతం. ఒరిస్సా సరిహద్దు జిల్లా కావటాన రెండు సంస్కృతుల సమ్మేళనం గల జిల్లా. అటవీ ప్రాంతం మూలంగా మైదానాల వారికీ కొండజాతుల వారికీ సంబంధాలున్న జిల్లా. సంస్థానాలూ, జమీందారీలు ఉండిన జిల్లా. ఈ ప్రాంతంలో జనానికి నెమ్మదితనం, సర్దుకుపోయే తత్వం, ప్రాంతీయ భావనలూ, వీటన్నింటితో బాటు తిరుగుబాటు చేసే ధైర్యసాహసాలూ – బహుశా – ఆ ప్రాంతంలోని పరిస్థితుల వల్ల అలవడి ఉంటాయి.

రామారావు 1929–33ల మధ్య మురపాకలోనే 4వ తరగతి వరకూ చదువుకున్నారు. ఆ సమయంలో సుమతీ శతకం, దాశరధీ శతకం, నృసింహ శతకం, భక్త చింతామణీ శతకం వంటివి పాఠ్యాంశాలు. ఇప్పటికీ వాటిల్లో కొన్ని పద్యాలు నోటికి వస్తాయి.

5, 6 తరగతులు 33 నుంచి 35 వరకూ 'చెట్టుపొదిలాం' అనే గ్రామంలో పెత్తల్లి గారి యింట్లో ఉండి, 3 మైళ్ళ దూరంలోని 'సిగడాం' గ్రామంలో బోర్డ్ హయ్యర్ ఎలిమెంటరీ స్కూల్లో చదివారు. ఆరోజుల్లో భట్టి విక్రమార్క, భోజరాజు, తెనాలి రామలింగడు వగైరా కథలూ, వచన భారతం, కుశలాయకం వంటివి చదివారు. దండకాలు, కందార్థ దరువులతో పరిచయం కలిగింది. కట్టుపద్యాల పోటీలో బాగా ఆసక్తి చూపేవారు.

10–5 – '35 నించి అయిదు రోజుల ఉపనయనం జరిగింది.

ఆరవ తరగతిలో రామారావుకి అల్లరి చిల్లరి తిరుగుళ్ళూ, చుట్టలూ, పేకాటలూ అలవాటయాయి. బడి ఎగ్గొట్టి ఆటలాడటం నేర్చి పరీక్ష తప్పారు.

దాంతో పేర్రాజుగారు కొడుకుని శ్రీకాకుళం పట్టణంలో చక్రపాణి వెంకట్రావు అనే హయ్యర్ గ్రేడ్ ఉపాధ్యాయునికి

అప్పగించారు. వారింట్లోనే ఉంటూ, తింటూ 1939 వరకూ చదువుకున్నారు. ఆ అనుభవాల ఛాయలు 'అభిమానాలు' కథలో కనిపిస్తాయి. తల్లిదండ్రులకు దూరంగా ఉండవలసివచ్చే పిల్లలలో పుట్టిపెరిగే ఒంటరితనానికి రామారావు లోనయారు.

జూన్ 35 నుంచి గురుకుల వాసం వంటి మాస్టారింట్లో ప్రైవేటులో చదివి, జూన్ 36లో శ్రీకాకుళంలోని ఎం.హెచ్. స్కూల్లో ఏడవ తరగతిలో చేరారు.

1937వ సంవత్సరంలో – 12 ఏళ్ళ రామారావు – తొలిసారి రైల్లో శ్రీకాకుళం స్టేషన్ (ఆముదాలవలస) నుంచి సిగడాం వరకూ వెళ్ళి, చెట్టు పొదిలాం గ్రామానికి – వంటరిగా – నడిచి వెళ్ళారు. అక్కడ నుంచి మొట్టమొదటిసారి విశాఖపట్నంలో ఒక పెళ్ళికి తీసుకువెళ్ళారు, బస్తీ పెళ్ళి వారు. సముద్రతీరాన కొన్ని గంటలు గడపడం, వంటి విషయాలు రామారావు తొలి జ్ఞాపకాలలో కొన్ని.

1939లో 10వ తరగతి చదువుతున్నప్పుడు జబ్బుచేసి ఆరు నెలలపాటు మంచం పట్టారు. 1940 మార్చిలో పుల్లెల సత్యనారాయణ గారింట్లో ఉండి పదవ తరగతి పరీక్షకి కూర్చుని పాసయ్యారు. అయినా 1940–41 విద్యా సంవత్సరంలో చదువు సాగలేదు. డాక్టరు సలహాపైన మురపాకలో స్వగృహంలోనే ఉన్నారు.


మురపాక గ్రామంలోని సొంత ఇల్లు

ఆ సంవత్సరమే రామారావు జీవితంలో అత్యంత ప్రాధాన్యత గల సంవత్సరం. మురపాకలో రామకృష్ణ గ్రంథాలయంలోని పుస్తకాలతో సాన్నిహిత్యం ఏర్పడింది. ఆంధ్రపత్రిక ఉగాది సంచికలూ, భారతులూ, డిటెక్టివ్ నవలలూ, నాటకాలూ, మనుచరిత్రా, వసుచరిత్రా వంటి ప్రబంధాలూ, గీరతం, నానారాజసందర్శనం వంటి తిరుపతి వెంకటకవుల గ్రంథాలూ, సాక్షి ఉపన్యాసాలూ, పత్రికలూ, వేయి పడగలూ, వడ్లగింజలు వంటివి చదువుకున్నారు. అప్పుడే ఆయన తొలిసారిగా రాసే ప్రయత్నాలు చేశారు. 14వ ఏటనే – ముద్దు – అనే కథా, ఒకటి రెండు పద్యాలూ రాశారు. అవి అముద్రితాలు. అలభ్యాలు.

ఆ సంవత్సరం నుంచీ తండ్రి కరిణీకపు లెక్కలలో రామారావు సహాయ పడుతుండే వాడు. మురపాక గ్రామంలో భూములు చేతులు మారడం, పంటలలో మార్పులు రావటం, చెడిపోతున్న వారు కొందరయితే బాగుపడుతున్న వారు మరికొందరవటం మొదలైన విషయాల పట్ల ఆసక్తీ ఆలోచనలూ కలిగాయి.

1941–42 విద్యా సంవత్సరం శ్రీకాకుళం గుడివీధిలో పుల్లెల వారింట్లో ఉండి యస్.యస్.యల్.సీ. (11వ తరగతి) చదువుకుని, పరీక్ష రాసి పాసయారు.

ఆరోజుల్లోనే పుట్రేవు రామరాజారావుతో గాఢ స్నేహం ఏర్పడింది. ఆయన అన్నగారి కథలు 'భారతి'లో వస్తూ వుండేవి. 'పూభా' కలం పేరుతో గల్పికా రచయితగా పేరొందిన రంగుడు వెంకటరమణ కూడా గుడివీధిలోనే ఉండేవారు. ఆయన వల్లనే వేదుల, జాషువా, కరుశ్రీల ఖండకావ్యాలతో పరిచయమయింది. సౌందర్యలహరి, రామాయణం వంటివి రాసిన సోమంచి వాసుదేవరావూ, హైస్కూలు తెలుగు పండితులు గరిమెళ్ళ సూర్యనారాయణల కవిత్వాలు వినే అవకాశం లభించింది. అప్పటికే పత్రికలలో కథా రచయితలయిన వలివేటి బాలకృష్ణశర్మ రామారావుకి పరిచయమయ్యారు. ఆ దశలోనే అప్పటి కాంగ్రెస్ రాజకీయాలతో స్కూల్లో మాస్టర్ల ద్వారా పరిచయం అయింది.

1942 వేసవిలో స్వగ్రామంలో ఉంటూ వేదాంత గ్రంథాలూ, గాంధీ రచనలు 'బ్రహ్మచర్యమూ' 'ఆత్మకథ' చదివారు. సత్యమంటే ఏమిటి? జీవిత పరమార్థం ఏమిటి? వంటి చింతనలకు లోనయారు. సత్యమంటే దైవమని భావించారు. సత్యాన్ని తెలుసుకోడం కోసం జూన్ '42లో ఇల్లు విడిచిపోయి పాపికొండలు వెళ్ళాలని ప్రయత్నం చేశారు. కాని రెండు రోజులలోనే తిరిగి యింటికి వచ్చారు.

అయితే – '41, '42లలో చదివిన పుస్తకాల ప్రభావంతో మొదలయి, బలపడిన ప్రశ్నలూ – అవి కలిగించిన కలవరపాటూ రామారావు జీవితమంతా వెన్నాడుతూనే వుండిపోయాయి.

ఆ సమయంలోనే ఆయనకు చిత్రకళపై ఆసక్తి కలిగింది. వాటర్ కలర్సూ, పెన్సిళ్ళూ ఉపయోగించి బొమ్మలు వేశారు. దాదాపు 1950 వరకూ చాలా చాలా బొమ్మలు వేశారు.

యస్.యస్.యల్.సి. పాసయాక, టైపు నేర్చుకోవడం కోసం విజయనగరంలో బులుసువారి యింట్లో ఉండి వారి పిల్లలకు పాఠాలు చెప్పారు. అక్కడ పబ్లిక్ లైబ్రరీలో పుస్తకాలు చదవటం, పార్కులో కథలు వినటం ఆయనకు మరపురాని విషయాలు.

ఫిబ్రవరి '43లో పెద్దచెల్లెలి వివాహం జరిగింది. ఏప్రిల్

నెలలో చెల్లెలు, బావగార్లతో విశాఖపట్నం చేరి టైపు నేర్చే ప్రయత్నం చేశారు రామారావు.

విశాఖపట్నం హిందూ రీడింగ్ రూంలోని పుస్తకాలు ఆయనని బలంగా ఆకర్షించాయి. ఠాగూర్, శరత్, గోపీచంద్, చలం, విశ్వనాథ, శ్రీపాద, కొడవటిగంటి, జి.వి. కృష్ణారావు అప్పటి ఆయన అభిమాన రచయితలు.

వివిధ విధాలుగా ప్రపంచం గురించి, జీవితలక్ష్యం గురించి ఆయా రచయితలు చెబుతున్నవి రామారావులోని సత్యాన్వేషణకు తోడయి ఒక కల్లోలానికి గురిచేశాయి. వేదాలు చదివితే సత్యం తెలుస్తుందని భావించి, వేదాలు చదవటం కోసం తిరిగి రెండవసారి యిల్లు వదలి వెళ్ళిపోయారు. పిఠాపురం, సామర్లకోట, రాజమండ్రి వగైరా ఊళ్ళు తిరిగారు. రాజమండ్రి వేదపాఠశాలలో చేరదామని ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నాలు విరమించుకుని తిరిగి యిల్లు చేరారు.

1943వ సంవత్సరంలోనే సెప్టెంబరు 1వ తారీఖు 'చిత్రగుప్త'లో కార్డు కథలు శీర్షికలో రామారావు "ప్లాటుఫారమో..." అనే రచనను ప్రచురించారు. ప్రచురణలో ఆయన మొదటి రచన అదే!

రాసిన వెంటనే రచనను పోస్టు చేయకుండా, కొన్ని రోజులు ఆగి తిరిగి చదివేవారు. బాగులేదనిపిస్తే చించేసేవారు. ఫరవాలేదనిపిస్తే పత్రికకి పంపేవారు. పంపిన వాటిలో ఒక్క కథ తప్ప ఏదీ తిరిగి రాలేదు. 1963లో 'భారతి' వారు తిప్పి పంపిన 'వధ' కథను ఆయన తిరిగి ఏ పత్రికకీ పంపలేదు. విశాఖ రచయితల సంఘం ప్రచురించిన 'విశాఖ' పత్రికలో వారి బలవంతం మీద ఆ కథ వచ్చింది. పంపిన రచనలన్నీ ప్రచురించబడ్డాయి. 'కాళీపట్నపు' అనే తమ యింటి



**1942-ఎస్.ఎస్.ఎల్.సి. పరీక్షకి ఇచ్చిన ఫోటో**

పేరుతో ఆయన కథలు వెలువడేవి. క్రమంగా సంపాదకులు 'కాళీపట్నం' అన్న పేరుని వాడేవారు. అదే స్థిరపడి 'కాళీపట్నం రామారావు' అనే పేరు ప్రసిద్ధమయింది.

1943 నుంచి విశాఖపట్నంలో ఎక్కువగా నివసించిన రామారావు అనేక ఉద్యోగాలు చేశారు. డిస్ట్రిక్ట్ కోర్టులో కాపీ సెక్షన్‌లో రీడర్‌గా చేరారు. అదే తొలి ఉద్యోగం. రెండవసారి యిల్లు వదలి వెళ్ళి తిరిగి వచ్చాక కోటవురట్ల రిసీవర్స్ ఆఫీస్‌లో టైపిస్టుగా చేరారు. ఆ ఉద్యోగంలో కొన్ని నెలలు పనిచేసి స్వశక్తి మీద వచ్చింది కాదని భావించి మానేశారు. 1944 మార్చిలో రేషనింగ్ ఆఫీసులో ఎంక్వయిరీ ఆఫీసరుగా చేరారు. 'మసూనా'గా ప్రసిద్ధులయిన మండా సూర్యనారాయణ అదే ఆఫీసులో పని చేసేవారు. ఆయనని పై అధికారి ఏదో అన్నందుకు ఎదురు తిరిగి 'మసూనా'తో కలిసి రామారావు ఆ ఉద్యోగానికి రాజీనామా చేశారు.

1945లో మూడవసారి రామారావు యింట్లో తెలియ బరచకుండా ఏదైనా పత్రికలో ఉద్యోగం సంపాదించుదామని మద్రాసు వెళ్ళారు. అప్పుడే శ్రీశ్రీని కలిశారు. ఏ ఉద్యోగమూ రాలేదు. ఆకలితో మద్రాసు రోడ్లమ్మట తిరుగుతున్న రామారావుని ఒక "గుంటూరు సజ్జనుడు" ఆదరించి, సహాయంచేసి విశాఖపట్నం తిరిగి పంపారు.

రామారావు 'రాగమయి' అనే పెద్ద కథను లేదా చిన్న నవలను ఆ పెద్దమనిషికి 'అంకితం' యిస్తూ యిలా రాశారు.

"ఒకప్పుడు నేను మద్రాసు వీధులలో దిక్కుతోచక అల్లాడుతూ ఉండగా తెలుగు వాడినై ఉండటం తప్ప యింకే యితర యోగ్యతాలేని నాకు అయాచితంగా యెంతో సహాయం చేసిన ఒకానొక గుంటూరు సజ్జనునకు.ఆ తరువాత అతని పేరైనా జ్ఞాపకం ఉంచుకొనలేకపోయిన నా కృతజ్ఞతా హీనతకు శాశ్వత చిహ్నంగా ఇది అంకితం".

రామారావు ఈ ఒక్క రచన తప్ప మరిదేన్నీ అంకితం యివ్వలేదు. మద్రాసు నించి తిరిగి వచ్చాక, రామారావులోని కల్లోలం ఆత్మహత్యా ప్రయత్నానికి దారితీసింది. సత్యం తెలుసుకోలేక పోయానని, అందువల్ల జీవితం వ్యర్థమనీ విపరీతమైన అశాంతిలో రామారావు ఆత్మహత్యా నిర్ణయం తీసుకున్నారు. యాదృచ్ఛికంగా ఆ ప్రయత్నం విఫలమయింది. ఆత్మహత్య ఎంత భయంకరమైనదో గ్రహించిన రామారావు తన కథలలో పాత్రలకి ఆత్మహత్య పరిష్కారాలు యివ్వరాదనీ; ఆత్మహత్యను చిత్రించవలసి వస్తే ఆకర్షణీయంగా కాక భయమూ, అసహ్యమూ కలిగేలా రాయాలని ప్రయత్నించారు.

విశాఖపట్నం స్టాఫ్ ఆఫ్ రాయల్ ఇంజనీర్స్ ఆఫీసులో గుమస్తాగా కొన్నాళ్ళు పనిచేసిన రామారావు అదే వూరిలో ఇంజనీరింగ్ స్టోర్స్ డిపోకి బదిలీ అయారు.

అక్కడ పనిచేస్తున్నప్పుడు 1946 మార్చి 19వ తారీఖున



**వివాహం : 19.3.1946**
**(ఎడమ నుంచి కుడికి) సీతామహాలక్ష్మి, కాళీపట్నం రామారావు, కాళీపట్నపు కృష్ణారావు**
**వుప్త్రేవు రామరాజారావు, వుప్త్రేవు నరసమ్మ**

రామారావుకి సీతామహాలక్ష్మితో వివాహం జరిగింది. అప్పటికి ఆయనకి 21 సంవత్సరాలు. వివాహం జరిగిన కొద్ది నెలలలోనే 80 రూ. జీతం వచ్చే స్టోర్స్ డిపోలోని ఉద్యోగానికి రాజీనామా చేశారు. తన సాహిత్యాసక్తికి ఉపాధ్యాయ వృత్తి సానుకూలంగా ఉంటుందన్న ఆశతో 30 రూ. జీతం దొరకటానికి అవకాశం గల ఉద్యోగం కోసం భీమునిపట్నంలో సెకండరీ గ్రేడ్ టీచర్ ట్రైనింగ్‌లో చేరారు.

మంచి ఉద్యోగాన్ని వదులుకుని ట్రైనింగ్‌లో చేరడం తండ్రి పేర్రాజుకి బాధ కలిగించింది. మందలించారు. అందువల్ల ఆయన ఇచ్చిన డబ్బు తీసుకోకుండా తన ఉపకార వేతనంతోనే ట్రైనింగ్ పూర్తిచేశారు. హాస్టలు సెక్రటరీగా ఉన్న రామారావు ఎవరో తప్పుగా మాట్లాడారని తెలిసి, రాజీనామా చేసి తిరిగి ఎన్నికలు జరిపించారు. అరవై అయిదు శాతం ఓట్లతో మొదటిసారి సెక్రటరీ అయిన రామారావు తొంభై శాతానికి పైగా ఓట్లతో తిరిగి ఎన్నికయారు.

1946-47ల మధ్య టీచర్ ట్రైనింగ్‌లో 'భారతి'లో పద్యాలు రాస్తుండే పెద్దాడ వీరభద్రరావూ, 'నడిచే విజ్ఞాన సర్వస్వంగా' రామారావు చెపుతూండే గంటి అప్పల నరసింహంలతో గాఢమైన స్నేహానుబంధం ఏర్పడింది. అప్పల నరసింహంతో స్నేహం మొన్నటి వరకూ కొనసాగుతూనే వుంది. ఇపుడాయన లేరు.

ఆ ట్రైనింగ్ సమయంలోని మిత్రుల మీద వీరభద్రరావు రాసిన పద్యాలలో రామారావు మీద రాసినది ఆయన స్వభావం పట్ల కొంత ఆధారం యిస్తుంది.

"వచన కవిత్వ వైఖరుల వ్రాయసకాడు కళాభిమాని
వా గ్రచనల ముగ్ధడొక్కరికి గాని యయిష్టము సేయబోడు
వి ప్రచలిత మానసంబులగు పైంట్లు పటంబులు వ్రాయువాడు,
కర్మఠుడు రామారావు మొగమాట మొకింతయు లేని వాడయా!"

రేషన్ చాలక హాస్టల్లో వచ్చే యిబ్బందుల గురించి 'తెలిసిందా నేనెవరో' అనే నాటిక రాసి ప్రదర్శించారు.

ఆ ట్రైనింగ్ సమయంలోనే రామారావుకి భళ్ళమూడి నారాయణరావు స్నేహమూ, అతని ద్వారా మార్క్సిజంతో పరిచయమూ కలిగింది. 'అప్రజ్ఞాతం' అనే కథలో ఆయనకి మార్క్సిస్టుల పట్ల అప్పటికి గల దృష్టి కొద్దిగా తెలుస్తుంది.

టీచర్స్ ట్రైనింగ్‌లో రామారావు సైకాలజీ పేపరు తప్పారు. తిరిగి 1948 మేలో మళ్ళీపరీక్షకు కూర్చుని పాసయారు. ఈమధ్య కాలంలో అంపోలు బోర్డు స్కూల్‌లో అన్‌ట్రైన్డ్ టీచర్‌గా పనిచేశారు.

1948 జూన్‌లో సెయింట్ ఆంథోనీ స్కూలులో చేరిన రామారావు 1979లో పదవీ విరమణ వరకూ అక్కడే పనిచేశారు. 1948లోనే ఆయనకు ప్రథమ సంతానం కలిగింది. 'కేసరి' అనే పేరుతో కొన్ని కథలు రాసిన కాళీపట్నపు సుబ్బారావు ఆయన పెద్దకొడుకు.

1948 వరకూ ఆయన రాసిన రచనలు ఈ భాగంలో ఉన్నాయి. ఆ కాలంలోనే రాసిన కొన్ని పద్యాలు కూడా యిందులో చేరాయి. ★

# ప్లాటుఫారమో?

పల్లెటూరి సరుకంతా నిగ్గు. గాలీ నీరూ ఆహారం ఆడపిల్లలూ సంభాషణలూ ప్రకృతీ – అన్నిటిలోనూ, అందమూ సున్నితం లేకపోయినా, జీవం వుట్టిపడుతూ, ఆకర్షణీయంగా నిబ్బరంగా ఉంటాయి. అందుకనే నేను పల్లెటూరి పిల్లను కోరి చేసుకున్నాను. ఆవిధంగా నయినా అప్పుడప్పుడు పల్లెటూరి సౌందర్యలక్ష్మిని పొందవచ్చునని ఆశ.

అల్లుళ్ళ పండుగ దివాలీకి అక్కడే ఉన్నాను. సాయంత్రం మా ఆవిడ నన్నలంకరిస్తోంది. "అక్కా! అక్కా!" అన్న కేకలు ఝూ...మని గాలివానలా దగ్గర పడుతున్నాయి. పన్నె పారేసి తొందరగా బయటకు పరుగెత్తింది, ఎదుర్కోవటానికి. నేనేదో చదువుతున్నట్టు నటించబోయాను. ఎందుకో ఆ భయం? తుఫాను ద్వారం దగ్గర ఆగింది. పదహారు సంవత్సరముల అమ్మాయి, అందమయిన ముఖం కాదు గాని కలకల్లాడుతూ ఆకర్షవంతం గా ఉంది. బాగా టాయ్‌లెట్ అయ్యింది. ఏదో ఉత్సాహంగా దబదబ మాట్లాడుతోంది. పొరుగు వాళ్ళమ్మాయనుకుంటాను. బహుశా నన్నూ చూసి ఉండదు. మా ఆవిడ మెల్లగా అక్కడ నుండి తీసుకుపోయింది. ఎందుకో ఆ మాయ?

ఉబుసుపోకకు అరమైలు దూరాన వున్న ఆ ఊరు రైల్వేస్టేషనుకు వెళ్ళాను. అక్కడ పిల్లల ఉత్సాహం మొదలైన వాటి గురించి ఆలోచిస్తూ అరగంట టయిమయింది. ఆ అమ్మాయి జ్ఞాపకానికి వచ్చింది. ఆలోచిస్తూ వుంటే ఆమె ముఖం దేనితో పోల్చడం అని సందేహం వచ్చింది. ఆలోచిస్తూ చెట్టు కింద గడ్డిలో కూర్చున్నాను. కలకల లాడుతుంది గాని అందంగా ఉండదు. పరధ్యానంగా పట్టాలవైపు చూశాను. దూరంగా పొగ. ప్లాటుఫారంవైపు చూశాను. అంతమంది ఎక్కణ్ణుంచి వచ్చారో అప్పటికప్పుడు; జనంతో కలకలలాడు తోంది. ఆ.. ఆ అమ్మాయి ముఖం లాగా ఉత్సాహంగా వుంది.

టంగ్ టంగ్ టంగ్ టంగ్... ఆ అమ్మాయి నవ్వులాగే కొట్తోంది గంట.

చుక చుక చుక చుక అంటూ వచ్చి అలిసిపోయినట్టాగింది రైలు. ప్లాటుఫారమంతా ఆతృతతో ఉబికింది.

టంగ్... టంగ్... టంగ్... టంగ్ మూలుగుతూ కొట్టింది గంట. గూ...ప్ అంటూ పెద్ద నిట్టూర్పు విడిచి వెళ్ళిపోయింది ట్రైను. రెండు నిమిషాల్లో ప్లాటుఫారం కళావిహీనమై శూన్యమయింది.

ఇంటికి బయలుదేరి, తాపీగా ఏదో పరధ్యానంగా, పట్టాలతో పోలుస్తూ, వస్తూ వూరికినే వెనుదిరిగి చూశాను. దూరంగా ఓ అబ్బాయి వస్తున్నాడు స్పీడుగా ట్రైనులాగా. అప్పుడప్పుడు వెనుదిరిగి చూస్తూ యిల్లు చేరుకున్నాను. అతడు అదే సమయానికి నన్ను కలిశాడు.

వడి తగ్గింది, ఇల్లు సమీపించగానే – ప్లాటుఫారం సమీపించిన రైలులాగ. వీధి మొదట ఉన్నాయి మా యిళ్ళు. పొరుగింటి అమ్మాయి వీధరుగు మీద నిలుచుని ఉంది. నేను మెట్ల దగ్గర ఆగి చూస్తున్నాను. ఆమె ముఖంలో ఆతృత – అప్పుడు ప్లాటుఫారం ఆతృతతో ఉప్పొంగినట్లే. ఆమె ముందర అతగాడు తమ్ముడు కావోసు – ట్రైను అలాగే స్పీడు తగ్గి క్రమంగా ఆగింది.

"రా... లేదు'. ఆమె మెల్లగానే అంది. కాని ప్లాటుఫారం గంట టంగ్... టంగ్... మని కొట్టినప్పుడు అందులో ఎటువంటి మూల్గు వినపడ్డాదో అలాంటిదే యిందులో కూడా నాకు వినపడ్డాది. గుప్‌మని నిట్టూర్పు విడిచి లోపలికి వెళ్లిపోయాడా అబ్బాయి. ఆమె శూన్యంగా చూసింది.

నే నాలోచిస్తున్నాను – యీమె ప్రియుని కోసం నిరీక్షిస్తోంది; మరి నా ప్లాటుఫారమో? ★

(కార్డు కథ: చిత్రగుప్త: 1943 సెప్టెంబరు 1, బుధవారం)

# వీసంలో..అయితే గియితే...

మానవుడు, బుద్ధి, మనస్తత్వం, కార్య నిర్ణయం – వీటి గురించి ఆలోచిస్తుంటే చాలా ఆశ్చర్యం వేస్తుంది.

ఒక్క వీసంలో ఊహాతీతమైన భయంకర పరిణామాలు...

ఆమధ్య మా వూరు వెళ్లాను. పెద్ద వర్షాలు పడ్డాయి. చెరువులన్నీ పూర్తిగా నిండాయి. సాయంత్రం పొలాల గట్లమ్మట తిరిగి వద్దామని బయలుదేరాను.

డాబా చెరువు గట్టు మీద నడుస్తున్నాను. చెరువు చాలా పెద్దది. సుమారు నాలుగు చదరపు మైళ్ళ వైశాల్యం. పూర్తిగా నీళ్ళతో నిండి సముద్రంలా గంభీరంగా వుంది. పెద్ద పెద్ద కెరటాలు గట్టును తాకు తున్నాయి.

రెండవ వంక వరిచేలు... ఆ దూ...రాన మసక మసకగా అగపడే నీలపు కొండ వరకూ అంతాపచ్చని వరిచేలు. మధ్య మధ్య ప్రతి అరమైలుకు ఒక చెరువు. సూర్య కిరణాలు ప్రతిఫలించటం చేత తళతళ మెరుస్తున్నాయి నీళ్ళు.

నడుస్తున్నాను గట్టు వెంబడి. ఒక దగ్గర చెరువు గట్టు పల్లంగా అగపడింది. ఆరు అంగుళాల ఎత్తునే వుంది. ఇంకొక్క వర్షం పడితే తప్పకుండా గండి వేస్తుంది.

గండే వేస్తేనా???... చేల వంక చూశాను... ఆ – చివరి వరకూ సమూలంగా ధ్వంసం. నాకా పంట ఖరీదు అంచనాకు అందలేదు. కొన్ని వేల ఖరీదు చేస్తుంది.

కాని గండి వేయదు. ఇవాళ ఎండ కాసేసింది యింక యింత వేగం వర్షం కురియదుగా – గండే వేయించాలంటే ఏం కష్టం లేదు.

ఓ కర్రపుల్ల పుచ్చుకొని గజం వెడల్పు మాత్రమే వున్న ఆ నానిన గట్టు మీద ఆరంగుళాల లోతున చిన్న కాలువ త్రవ్వటం కష్టం కాదు. ఇంకేముంది!

నీరు చెరువులోంచి బయటకు ప్రవహించడం ఆరంభిస్తుంది. కెరటాల కుదుపులకు అంచులు వేయబడి గంటలో యీ నది పది వూళ్ళ వాళ్ళూ వచ్చి ప్రయత్నించినా ఆపలేనంత వేగంతో నీరు ప్రవహించే పెద్ద గండి ఏర్పడుతుంది. తోవలో చేలన్నీ ఊడ్చిపెట్టుకుంటూ క్రింది చెరువులోకి యీ నీళ్ళన్నీ పోయి పడతాయి. ఆ చెరువు యిప్పటికే నిండి ఉంటుంది... ఈ నీరు కూడా కలిస్తే ఆ చెరువు కూడా గండి వేస్తుంది. అలా అలా... అంతా...

ఎంత నష్టం...? ఎన్ని కుటుంబాల గోడు...? ఎంత కరువు...? ఎన్ని చావులు...? ఎన్ని దొంగతనాలు?... ?....

నేను ఆలోచిస్తున్నాను. ఏమీ చేయలేననుకున్న నేను తలచుకుంటే ఎంత భయంకర కార్యం చేయగలను?...

అకస్మాత్తుగా బుద్ధి పుట్టింది. ఈ భయంకర కార్యం చేసేయాలనే. ఎందుచేత అంటే... ఏమో!

ఓ కర్రపుల్ల పుచ్చుకుని కూర్చున్నాను.

చేయి వడికింది. ఇంకా ఏవేవో అయింది – లేచిపోయాను.

ఆలోచిస్తుంటే నవ్వొచ్చింది.

ఈ క్షణాన యీ అనామకుడి నిర్ణయం మీద కొన్ని వేల కుటుంబాల సుఖదుఃఖాలు ఆధారపడి వున్నాయా?

మొన్న డబ్బు కోసరం నానా యిబ్బందీ పడ్డాను. రిక్రూటింగ్ ఆఫీసుకు వ్రాసి అప్లికేషను తెప్పించాను. అప్లికేషను ఫారము నింపి కవరులో పెట్టి టపా పెట్టె వద్దకు వెళ్ళాను. పడేస్తే?

ఎంత మార్పు.

ఇంతకూ పడేయలేదనుకోండి.

కాని పడేస్తే...???

★

*(ఆనందవాణి: 10, సెప్టెంబర్, 1944)*

# భాయీజాన్

నీ వుత్తరం అందింది. ఈ వూరు వచ్చి రెండు రోజులు నాతో కులాసాగా గడపాలనుందని వ్రాశావ్ –

నీకు యిక్కడి పరిస్థితులు తెలియక యిలా రాశావ్. నువ్విక్కడకు రావడం వృథా ప్రయాస. రావద్దు!

నాతో యీ వూళ్ళో రెండు రోజులు గడపడం కులాసాగా వుంటుందనుకుంటున్నావ్. కాని నీతో రెండు దినాలు గడపడానికి స్వేచ్ఛాజీవి ననుకుంటున్నావు. నేను యీ వూరు పొలిమేర అనుజ్ఞ లేకుండా దాటడం మహాపరాధాలలో ఒకటన్న సంగతి నీకింకా తెలీదల్లే వుంది.

ఈ వూళ్ళో రెండు రోజులు కులాసాగా గడుస్తాయి అనుకుంటున్నావు. ఇది యింకొక పొరపాటు. ఇక్కడకు వస్తే ఎక్కడ వుంటావో ముందు చెప్పు...? మూడు మూళ్ళ పొడవూ నాలుగు మూళ్ల వెడల్పూ వున్న నా గదిలో నా పెట్టె, బెడ్డింగ్, బుక్‌షెల్ఫ్, చిల్లర వస్తువులూ మూడు వంతులు ఆక్రమించగా, నేను కాక ఇంకా నువ్వూ, నీ సామానూ, యెక్కడ యిముడుతారని? అటువంటి గదిలో యెందుకున్నావ్ అంటావేమో? దీనికే వందన్నర పోటీలు యీ వూళ్ళో! యింక నీ భోజనం మాట?

ఈ రేషనింగ్ దినాల్లో పరిచయుల యింటికి వెళ్ళి భోజనం చేస్తాననడం నిజంగా క్రూరం. హోటల్లో తినలేవు. కమ్మటి ఆవు నెయ్యికి అలవాటుపడ్డ వాడవు మరిగి మరిగి ఆముదంగా మారిన నేతితో ఒక్క పిడచైనా నోట పెట్టగలవా? వారానికో క్రొత్తరకం బియ్యం రావడంచేత పదును తెలియక పలుకో, ముద్దో అయిన అన్నం ముట్టనైనా ముట్టగలవా? బీరపీచూ, బెండపళ్ళ కూరలతో అన్నం కలపగలవా? మార్పు వల్ల కొళాయి నీళ్ళు కడుపు నొప్పి పుట్టిస్తున్నాయని ప్రతివారి నోటా వింటూ గుక్కెడు నీరయినా మ్రింగగలవా? ఇంక విస్తరి దగ్గర కూర్చొని శ్రీనాధుడిలా–

యెన్నడు కడిగట్ట యెరుగనైతిని యని
కుడి హస్తమా నీవు జడియబోకు

– అంటూ అవయవాలకు ధైర్యం చెప్పుకోవాలి. మా మాటా? మే మెప్పుడో మానవాతీతులమై వూరుకున్నాం–

నాల్గు గంటల నిద్రతో తృప్తిపడగలం. కాళ్ళూ చేతులూ ముడుచుకొనే నిద్రపోగలం. పచ్చిబియ్యం, బీరపీచూ, ఆముదంతో తృప్తిగా భోం చేయగలం. కడుపు నొప్పినీ, డయేరియానీ ధైర్యంగా ఎదుర్కోగలం. లారీలు అరా పాతికా దేహాన్ని గీరుకుంటూ పోయినా త్వరలో గాయాల్ని మాన్పుకోగలం. రాక్షసి బొగ్గు పొగపీల్చి బ్రతకగలం.

నువ్వు మానవ మాత్రుడివి. హాయిగా పల్లెపట్టులలో బ్రతుక నేర్చిన వాడివి. యీ వాతావరణంలో రెండు రోజులైనా బ్రతకలేవు.

పోతే, నువ్వు నా సలహాను కాదని వచ్చావంటే నా గత జీవితంలోని మధుర దృశ్యాలనూ, ఆదర్శాలనూ, ఆశయాలనూ జ్ఞాపకం చేస్తావ్. వాటిని విడిచినందుకు అశక్తితో నేను బాధపడతాను. రెండు రోజులుండి పోతావ్. నీతోటి నా చిన్నతనపు రోజులు జ్ఞాపకం వస్తాయ్. వేదనతో హృదయం తపించి పోతుంది.

ఏదో సుడిగుండంలో పడికొట్టుకుపోతూన్న నన్నూ రెండు రోజులు స్వర్గంలో దింపి తర్వాత నన్ను నరకానికి త్రోయడమెందుకూ?

వృధాగా వచ్చి నువ్వు బాధపడి, నన్ను బాధపెట్టడం నాకు యిష్టం లేదు. నువ్విక్కడకు ఎంతమాత్రమూ రావద్దు... ★

*(ఆనందవాణి: 15, అక్టోబర్ 1944)*

# వెళ్ళిపోయింది

అత్తవారింటి నుంచి, చిట్టితోనూ పాపాయితోనూ పెద్ద ఆడుబిడ్డా దూరాన వుద్యోగం చేస్తున్న పెద్దబ్బాయ్, చదువుకుంటున్న చిన్నవాడూ అంతా వస్తారు. నిస్తేజమయిన యిల్లు ఒక్కసారి కలకలలాడుతూ వెలుగుతుంది.

సాయంకాలం వేగిరం భోజనాలు పూర్తి చేసుకుందామని ప్రయత్నిస్తూనే ఆలస్యంగా భోజనాలు చేసి యింటి నిండా పరచిన ప్రక్కల్లో వెచ్చగా కప్పుక పడుకొని చాలా కాలంకు కలిసిన యేకోదరులూ, తల్లితండ్రులూ ఒకరితో ఒకరూ, ఒకరు విడిచి ఒకరూ ఏవేవో 'తరగని సంగతులు' చెప్పుకుంటారు.

అవ్యక్తావస్థలో నిద్రపోయి చక్కని కలలు కంటారు.

తెల్లవారుజామున దూరాన దేవాలయంలో నుంచి సన్నాయి మీద మేలుకొలుపు పాట సన్నగా వినపడుతుంటే, పెరట్లో దాసీమనిషి ఒకటొకటే చొప్పున కుంకుడుకాయలు 'దిబ్ దిబ్'మని చిదుగకొడుతుంటే, ముందుగా మేల్కొన్న పొరుగింటి నుంచి బిందె చెంబూ తాకుడువల్ల కలిగిన శబ్దం 'టంగ్... టంగ్'న వినపడుతుంటే, వారగా తీసిన తలుపు సందులోంచి దొంగతనంగా ప్రవేశించిన చలిగాలి ముసుగులోకి కొంచెంగా దూరి వింత అనుభవం కలిగిస్తుంటే, ఆ సంవత్సరమే పెళ్ళయి యింకా కాపురానికి పోని చిన్న ఆడుబిడ్డ వచ్చి "అన్నా! అక్కా! చిన్నన్నా! లెండర్రా! లెండర్రా! తలంటుకుందురు గాని, చిట్టీ! లేవే. లెండర్రా అమ్మ లెమ్మంటోంది తెల్లారిపోతోంది" అని మేల్కొలుపుతుంది.

గునుస్తూ గునుస్తూ చాలా కాలంకు మళ్ళా అమ్మచేత తలంటు పోయించుకుంటారు.

తూరుపు తెలతెలవారే వేళ-

చీకట్లు మిగిలిన తూరుపున పలుచని అరుణకాంతులు కన్పించే వింత శోభ - కుంకుడు పులుసు పడి కొద్దిగా ఎర్రవాడిన తెల్లని నల్లని కళ్ళల్లో అగపడుతుంటే-

రాత్రి మంచుకు తడివారిన ప్రకృతి సొగసు స్నానం చేసి మడిచిన తడి - తడి - తల కట్లలో అగపడుతుంటే,

ఉషఃకాల ప్రకృతి సౌందర్యం-

ప్రతి వ్యక్తిలోనూ గోచరిస్తుంది.

తెల్లగా వెల్లవేసి రంగులు పూసి సుందరంగా అలంకరింప బడ్డ యిళ్ళలో, శుభ్రంగా ఊడ్చి నీళ్లు జల్లబడి రంగవల్లికలు తీర్చబడిన వాకిళ్ళలో తెల్లని బట్టలు ఎత్తి పట్టుకుంటూ పిల్లలు సందడిగా తిరుగుతారు.

సాయంకాలం రంగురంగుల చీర కట్టి, ఆరి నూనె వ్రాయబడని తలకట్టు సగం సగంగా అల్లి చేమంతి పువ్వులు, బంతి పువ్వులూ తురిమి తాంబూల రక్తిమతోడి పెదవులలోంచి చిరునవ్వులు చిలుకుతూ కాటుక కండ్లలోంచి ఆనందం వెదజల్లుతూ స్త్రీలు పాపలను వెంటబెట్టుకొని బారులు కట్టి పేరంటాలకు పోతుంటారు.

చిట్టిపాపలను కుర్చీలలో కూర్చోబెట్టి భోగిపళ్ళు పోస్తారు.

టెక్కుగా దిగిన అల్లుళ్ళను ఎదుర్కొని పలుకరిస్తారు. మర్యాదలతో పనులన్నీ సందడిగా, తొందరగా చేస్తుంటారు.

భోజనాలు పూర్తిచేసి సంతోషంగా, సుఖంగా, తృప్తిగా నిద్దర పోతారు.

పండగ కానుక లందుకొని కొత్తబట్టలూ, ఆభరణాలూ ధరించి - బడబడ ధ్వనులు చేసే క్రొత్త బట్టలతో ఆనందంచేత కొట్టుకొనే గుండెలతో పెద్దలను సమీపించి నూనెరాసి నున్నగా దువ్విన తలకట్టులతో అంగారు బొట్లతోడి శుభ్రమయిన ఫాలాలతో బిడియపు చూపులుతోడి పెద్ద పెద్ద కండ్లతో ముద్దొచ్చే ముఖాలను వంచి వంగి నమస్కరిస్తారు.

ఆనందంతో గొంతులు మారి, మతులు చెలించి యేమని దీవించాలో మరిచి ఏదో దీవిస్తారు చివరకు.

క్రొత్తగా పెండ్లయిన కన్నెపిల్ల భర్తను దొంగతనంగా చూసే అప్పటి సంచలనంతో పరవశ అవుతుంది.

కాపురానికి యింకా పోని భార్య ప్రతి నిమిషం ప్రతి కదలికలోనూ రహస్యంగా తన ప్రేమను తెలియపరుస్తుంది భర్తకు.

సాయంత్రం గుంపులు గుంపులుగా చేరి ఆటలతోనూ, మాటలతోనూ గడిపేస్తారు ఉత్సాహంగా.

రాత్రి భోజనాలయాక పడుకుంటే అప్పుడు చిన్నతమ్ముడు అంటాడు - దిగులుగా.

"అప్పుడే పెద్ద పండగెళ్ళిపోయిందీ!" ★

*(ఆనందవాణి: 28, జనవరి - 1945)*

# వెనుకచూపు

మధ్యాహ్నం యింటర్‌వెల్‌లో టేబిల్ ముందర, డ్రాయర్ వళ్ళోకి లాక్కొని యెరియర్ వర్కు మేకప్ చేస్తూ కూర్చున్నాను ఒక్కణ్ణే. తోటి క్లర్కులంతా కాస్త ముందుగానే బయలుదేరి యిళ్ళకు పోయారు.

ఇవాళ విజయదశమి – పండగ – వాళ్ళకి యిళ్ళున్నయ్ – ముందుగా పోయారు. ఇల్లూ వాకిలీ లేని వాణ్ణి నేనొక్కణ్ణే – ఆఫీసులో పడున్నాను.

కనకయ్య తలుపులు మూసుకుంటూ వచ్చి నా దగ్గర ఆగి పలకరించాడు.

"ఇంటికెళ్ళరా? బాబూ"

"మనకు యిల్లెక్కడిదోయ్"

నిస్పృహగ అన్నాను వెనక్కు చారబడుతూ.

"అయితే తాళాలొదిలీతునా?"

"నువ్వింటికి పోతావా?"

"బాగుంది బాబూ! పండుగు పూట యిక్కడెవడు పడుంటాడు!"

"మీరు కూడా పూజ చేస్తారేమిటోయ్?"

''ఆc... ఆc. ఇయాళ గొర్రెపోతు లేస్తాం. అలవాటున్నోళ్ళు కసింతో కుసింతో నిసా సేస్తారు. యియాళ కూడా పెద్దపండుగే. ఆలెస్సమయి పోతోంది. తాళాలియిగో...టి... నేనెల్తాను మరి... తాళాలు తియ్యండి".

"తీస్తాలే నువ్వెళ్ళు".

ఆలోచనలో పడుతున్న బుర్రని కాస్త ఓసారి అటు మళ్ళించి మళ్ళా ఆలోచనలో పడ్డాను.

ఇవాళ అందరికీ పండగే.

నాకు మాత్రం పదిహేను రోజుల క్రిందటే పండగ అయిపోయింది.

పదిహేను రోజుల క్రిందట శలవు తీసుకొని యింటికి వెళ్ళాను.

"పండుగ పది రోజులు పెట్టుకొని ముందుగా వచ్చీశావేరా నాయనా?" అంది అమ్మ... అసంతృప్తితో. పండుగ కోసం చూస్తూ కూర్చుంటే రావటమే పడకపోవచ్చని అమ్మకు తెలియదు. సత్యంకు బాగా తెల్సొచ్చింది.

ఈ శలవు పండుగకే పెట్టి యింటికి వెళ్తే – తల్లిదండ్రులు పండగ నాడు యింటి దగ్గర వున్నందుకు సంతోషిస్తారు అంటూ తనను కూడా నాతోనే శలవు పెట్టి యింటికి ఓసారి పొమ్మని నేనంటే నా మాట లెక్క చేశాడు కాదు.

నేనింకా బోధపరచాను.

"పండగకు అందరూ శలవు కావాలంటారు. అందరికీ గ్రాంటు చేసి ఆఫీసు మూసేయరు కదా. కొందరి అప్లికేషన్సు విధిగా రిజక్టయి తీరుతాయి. ఆ దురదృష్ట వంతుల్లో నువ్వు ఒకడివి కావచ్చు. యిప్పుడయితే అనుమానం లేకుండా శలవు శాంక్షనవుతుంది. ఈ దినం పండగ – అంటూ ప్రత్యేక దినాలను సృష్టించింది మనిషే కదా. మనం యే రోజు యింటి దగ్గర వుంటే ఆరోజే మనకూ, మన వాళ్ళకూ పండగ అనుకుందాం" అని.

అమ్మతో కూడా యిలానే చెప్పాను. మింగరాని ముద్ద మ్రింగుతున్నట్టు 'అవును మరి' అంది. కాని సత్యం మాత్రం వినలేదు. మొన్న సాయంత్రం ఆఫీసరుగారి దగ్గర్నుంచి వస్తూ, "నువ్వు చెప్పిన మాట విన్నాను కాదురా బాబూ" అంటూ రిజెక్టెడ్ అప్లికేషన్ చూపించాడు. అప్పటికప్పుడే ధన్యంరాజుకూ, స్వామికీ లీవ్ గ్రాంటయిపోయింది. మనవాడి అప్లికేషన్ చాలా లేట్‌గా అందింది.

కాని సత్యంకు వాళ్ళ బావా అక్కా వున్నారు. ఇవాళ వాళ్ళింటే పూజా, భోజనం కూడా.

నా మాటో...

పూజా లేదు – బుగ్గీ లేదు–

రాత్రి ఏవేవో వెర్రి భావాలతో కొట్టుకు చచ్చి చచ్చి ఆలస్యంగా నిద్రపోయి ఉదయం లేవడం ఎనిమిది గంటలకు లేచాను. ఎనిమిదింటికే ఆఫీసు – యింకేం పూజ –

కొసకు స్నానమైనా లేకండా కాఫీ హోటల్లో దూరాను యివాళ.

కాని కాలం ఎంత మార్పు తెస్తుందీ!

నా చిన్నప్పుడు – పదేళ్ళ క్రిందట – ఒక విజయదశమి –

నాకు కాస్త జ్ఞానం వచ్చిన దగ్గర నుంచీ సరస్వతీ పూజ ఆరంభించాను. బడిలో పూజ చేసుకొని వచ్చిన తర్వాత యింటి దగ్గర నాన్నతో కూడా సరస్వతీ పూజ చేసేవాణ్ణి. మరీ చిన్నవాణ్ణయి వున్నప్పుడు నాన్నగారు పన్నెండు గంటలకు పూజ చెయ్యడం అలవాటవడం చేత అప్పటి వరకూ నేను ఉపవాసం వుండడం కష్టమని అమ్మ బడిలో పూజ చేసుకుని వచ్చాక చద్దన్నం తినీసి కావలస్తే నాన్నగారు పూజ చేసేటప్పుడు దూరంగా నమస్కరిస్తూ కూర్చోవచ్చని చెప్పేది.

అందుచేత పట్టుపట్టి పన్నెండు గంటల వరకూ ఉపవాసం వుండి నాన్నగారితో పూజ చెయ్యడం మానేవాణ్ణి కాదు–

ఒకసారి–

ప్రతి సంవత్సరం వినాయక సరస్వతీ పూజలు రెంటికీ ఉదయానే – యింకా చీకట్లు పూర్తిగా విడకుండానే – లేచి

జగన్నాథస్వామి ఆలయం లోనూ, శివాలయంలోనూ వున్న పూలూ, ఇంకా యెక్కడెక్కడ వున్న పూలు కోసుకొచ్చే వాణ్ణి. పూజా పుష్పాల రాసినిబట్టి. నా భక్తిని కొలుస్తుండే వాణ్ణి. పువ్వులు సంపాదించడంలో అత్యాసతో ఎదుటింటి సుందరికీ మా పెదనాన్న గారికీ పువ్వులు దొరకకుండా జాగ్రత్తపడుతూ అన్నీ నేనే ఏరుక వచ్చేవాణ్ణి.

ఒక సరస్వతీపూజకు –

ఉదయాన్నే లేచి దగ్గరగా ఊరులో వున్న జగన్నాథ స్వామి ఆలయం లోని పువ్వులన్నీ ముందుగా ఏరీసాక, యింక శివాలయంకు పోదామను కుంటూ వచ్చేస్తుంటే అర్చకుని యింటి ముందర పెద్ద గులాబీ మొక్క దృష్టి నాకర్షించింది. ఆమధ్య కొమ్మ చివరనున్న పెద్ద గులాబీ పువ్వు ముందరికి అడుగు వెయ్యనిచ్చింది కాదు. అర్చకుడు – అతని పేరు స్వామి – ఎక్కణ్ణుంచయినా చూస్తున్నాడేమోనని ఓసారి నాల్గువంకలా చూశాను. యెక్కడా అగపడలేదు. మెల్లగా మొక్క దగ్గరకు వెళ్లాను. కమ్మటి కషాయగంధం ఆ పువ్వు సౌందర్యం ఆనాడు నన్నెలా కదిలించేయో జ్ఞాపకం లేదు. కాని చాలాసేపటి వరకూ అక్కడే వుండి పోయానని జ్ఞాపకం. చివరకు ఆ పువ్వు తాలూకా రేకు ఒకటి తృంచాను. భయం వేసింది కావోలు పరుగెత్తాను – అలా యించుమించు వూరు దాటిందాకా పరిగెత్తినట్టు జ్ఞాపకం. వూరు దాటాక తాపీగా శివాలయం వంక నడుస్తున్నాను – ఆలయం ఊరు బయటనే వుంది.

నాకు గులాబీ పువ్వులు తినడం చాలా ఇష్టం. నడుస్తూ నడుస్తూ యెప్పుడు పడేసుకున్నానో గులాబీరేకు నోట్లో పడేసుకొని తినీశాను.

వెంటనే జ్ఞాపకం వచ్చింది – ఆవేళ సరస్వతీ పూజ – ఉపవాసం... అని.

అప్పుడు నేను పడ్డ తపన ఎలా చిత్రించను. ఆ తపన తీవ్రత వర్ణించే శక్తి అయినా నాకు లేదు–

ఆదర్శశీలయైన వ్యక్తి అన్‌కాన్‌షస్‌గా తన శీలాన్ని కోల్పోయి వెలితి వచ్చి చూసుకున్నప్పుడు –

చాందస బ్రాహ్మణుడు తనకు తెలియకండా జాతిని పోగొట్టుకొని తెల్సుకున్న తర్వాత –

పొందే తీవ్రమయిన తపన పొందాను–

ఏడ్చాను – యెంతో పశ్చాత్తాపపడ్డాను – సరస్వతీదేవిని యీ ప్రమాదానికి అతి దీనంగా మనసులో క్షమాపణ వేడాను. ఎందుచేతో దేవి క్షమిస్తుందని నమ్మలేకపోయాను.

చివరకు నాయీ గొప్పతప్పిదాన్ని చనువు యెక్కువగా గల పెదనాన్న గారితో చెప్పి పరిహారం అడిగాను.

ఆయన చివరి వరకూ విని కొంచంగా నవ్వి తప్పులు చెయ్యడం మానవ సహజం అనీ, పశ్చాత్తాపడ్డాను కాబట్టి యింక పరిహారం అవసరం లేదనీ, యింకా భక్తితో పూజ చెయ్యమనీ దేవి క్షమించే వుంటుందని ధైర్యం చెప్పారు –

ఈ ఔషధం వల్ల గాయం నుండి రక్తం కారడం కట్టింది కాని నొప్పి, గాయం పోలేదు. ఆనాడల్లా బాధపడ్డాను –

యెన్నో గాయాలు కాలం గడిచాక మచ్చైనా లేకండాపోతాయి – యిదీ అంతే.

నమ్మకాలనూ – హృదయాలనూ – మనుష్యలనూ కాలం మార్చేస్తుంది. నేను మారిపోయాను – అందులోనూ గత సంవత్సరం మధ్య నేను నేనా అనుకునే అంతగా మారిపోయాను. ఆ మార్పు యెంత వేగంగా తోసుక వస్తోందీ అంటే తిరిగి చూడటానికైనా వీలీయనంత వేగంతో. యివాళ కొంచంగా వెనక్కు చూడగలిగాను – ★

*(ఆనందవాణి: 18, ఫిబ్రవరి – 1945)*

# నిజమే అయితే!!

చివరకు ఎవరో 'ఆ యిల్లే' అని చెప్పిపోయారు. తలుపుతట్టి ఆయన పేరు పెట్టిపిలిచారు. ఇక్కడ కాదంటూ తలుపు తెరిచింది ఓ అమ్మాయి.

పండు తమలపాకు శరీరశ్చాయ. అందమయినది కాకపోయినా ఆకర్షణీయమైన ముఖం. అంతవరకే గుర్తించగలను. నల్లగా తెల్లగా తళతళలాడుతూండే కండ్లను గుర్తించగలను యింకా. కొంచంగా బలిసిన శరీరం, పటుత్వం జారని రొమ్ము, ముగ్ధత్వం స్ఫురింపజేసే చూపులూ, ఊహిస్తే – పెండ్లయి వున్నా కాకపోయినా ఇంకా కన్యే అని స్పష్టంగా తెలుస్తుంది.

మాట్లాడాను. ద్వారాన్ని ఆనుకుని నిలబడి అడిగాను, ఏవేవో అనవసర ప్రశ్నలు కూడా! తెరవని రెండవ తలుపుకు చారబడి నా కళ్ళల్లోకి చూస్తూ ఆమె జవాబులు చెప్పింది.

ఎలా మాట్లాడిందని? ఎన్నటికీ ఆమెను మరువలేను.

యెందుచేత అంతగా ఆకర్షింపబడ్డానో తెలియదు. క్రొత్తవాడినయినా చనువుగా దగ్గరగా వచ్చి మాట్లాడటంలోని అమాయకత చేతో, మాట్లాడే కంఠంలోని మధురిమా, దయా చేతో, చూపులలోని మధురిమ, దయ, మృదుత్వముల చేతో యేలానో ఆకర్షింపబడ్డాను గాఢంగా.

ఆ సంఘటన తలచినప్పుడల్లా మధురాతి మధురంగా మారుతుంది మనస్సు దేహంలోని ప్రతి అణువూ ఎలాగో – వ్యక్తాతీతంగా – చలిస్తుంది.

ఇక ముందు నాకేం కావాలో తెలియదు. కాని యీ మధుర సంఘటనను యింతటితో యిలాగే – తక్కిన విలువలేని సంఘటనలకు లాగే – ముగించేయడానికి మనసొప్పదు.

ఇంకేం కావాలి నాకు? అందాకా పోలేదు మనసు యిప్పటివరకూ, మరింక...?

ఆ తెల్లని, నల్లని కళ్ళల్లోంచి చల్లగా, మృదువుగా, దయగా చూస్తూ చనువుగా ఎప్పుడూ మాట్లాడుతుండడం కావాలేమో?

ఇప్పుడిప్పుడు మనసింకా పరుగులెత్తుతోంది. అలా చూస్తూ మాట్లా డుతూ, యీ వూహాతీతమైన సృష్టిని అర్థం చేసుకోవడానికి పడే నా వెర్రి పాట్లునీ, బాధనీ సానుభూతితో చూస్తూ. నా కోసరం నిట్టూర్పు విడువగలిగి, నేను బాధగా, నిరాశగా, నిస్పృహగా పడుండేటప్పుడు తన ఆ దయాపూరితపు కండ్లలోంచి చూస్తూ చల్లని మెల్లని మాటలతో నన్ను లాలిస్తూ నాలో ఆశలను, ఉత్తేజాన్నీ రేపుతుంటే బావుణ్ణు.

కాని అంతపాటి అదృష్ట జాతకుణ్ణనుకోలేను, నా గత జీవితంలోని ఘట్టాలను చూసి. కాని అదృష్టం యిప్పుడే, యీ క్షణంతోనే ఆరంభం అవుతోందేమో అంటుంది ఆటంకపు మట్టి పొరల అట్టడుగు నుంచి ఆశాబీజం. ఎన్ని పొరలు మీద పడ్డా జీవత్వం నశించకుండా వుంది ఆ బీజంలో.

యెన్ని పొరలు. కాని దుర్భేద్యాలు కావు ఒకటీ. అందుకే ఆశ నశించకుండా వుంది. అవే పాషాణపు పొరలయితే జీవం నశించి వుండేదే.

కాని ఒక్కోసారి మళ్ళా అనుకుంటాను. ఒకవేళ ఆ మాధుర్యం, ఆ గొప్పతనం ఏదో ప్రమాదవశాత్తూ – నిజానికి మాధుర్యం సుంతైనాలేని గొంతు పాడే పాటలో ఏ వింత పరిస్థితుల వల్లో, పాషాణ హృదయాన్ని కూడా చలింప జేయగలిగే మధుర స్వరం ఒకటి కారుమేఘాల మధ్య మెరుపు జారినట్లు వెలువడ్డట్టే – అగుపడ్డాయేమో ననుకుంటాను.

ఈ ఆనంద భంగకరమైన భావాన్ని మళ్ళా మళ్ళా రానివ్వడం యిష్టముండదు కాని తప్పకండా వస్తూ వుంటుంది.

ఎందుకీ శ్రమ; యింకొకసారి ఆమెను కలిస్తే యీ అనుమానం నివృత్తి అయిపోతుంది కదా అనుకుంటాను–

కాని నా అనుమానం నిజమే అయితే హిమాలయాల మీంచి క్రింద పడటం కాదా!

మధురమైన అనుభవాన్ని పొందుతున్నాను. ఇది కలేమోనని అనుమానించడమెందుకో చక్కా అనుభవించకండా? కాని మనుష్య తత్వమే ఇందుకు వ్యతిరేకం–

అనుమానాన్ని సహించలేదు. స్తనశల్య పరీక్షచేసి అసలు సంగతి తెలుసుకోవడానికి ప్రయత్నం చెయ్యడం. అనుకూలమైతే పొంగి పొంగి ఆకాశము అందుకోవడం, ప్రతికూలమైతే కృంగి కృంగి పాతాళంలో పడడం.

పొంగు కృంగులలోని బాధ తెల్సుండీ పరీక్ష మానదు.

నేను... నేను...

నేను పరీక్షించలేను... మానలేను...

ఆలోచించి ఆలోచించి బుర్ర ఖాళీ అయింది. నా భావాలను యింకా చెప్పేందుకు వాటిని చూడగలిగే దివ్యదృష్టి క్రమంగా శిధిలమై నశించింది. ఇంకేం చెప్పలేను– ★

*(ఆనందవాణి: 25, ఫిబ్రవరి – 1945)*

**End of Preview.**

**Rest of the book can be read @**

http://kinige.com/kbook.php?id=223